# సూర్య

నేటి దినపత్రిక

www.suryaa.com

ఏలూరు జిల్లా, పశ్చిమ గోదావరి జిల్లా

మంగళవారం,4 ఫిబ్రవరి 2025 | 8 పేజీలు


### పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు

# ఒక నామినేషన్ దాఖలు

**10 వరకు నామినేషన్లు స్వీకరణ**



**ఏలూరు,మేజర్‌న్యూస్ :** తూర్పు,పశ్చిమ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ ఎన్నికలకు సంబంధించి కాకినాడకు చెందిన పేపకాయల రాజేంద్ర నామినేషన్ దాఖలు చేశారు. సోమవారం ఏలూరు కలెక్టరేట్లో తూర్పు పశ్చిమగోదావరిజిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, ఏలూరు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి వారికి కాకినాడకు చెందిన పేపకాయల రాజేంద్ర ఒక సెట్ నామినేషన్ పత్రాన్ని సమర్పించారు. అభ్యర్ధి పేపకాయల రాజేంద్రతో రిటర్నింగ్ అధికారి ప్రమాణం చేయించారు.ఈనెల 3వ తేదీ నుంచి నామినేషన్ల

- తరువాయి 2లో..

### ఏలూరు నగరపాలక సంస్థలో

# కొనసాగుతున్న టిడిపి హవా

**డిప్యూటీ మేయర్‌లుగా ఏకగ్రీవంగా ఎన్నికైన పప్పు ఉమామహేశ్వరరావు, వందనాల దుర్గాభవాని**







**ఏలూరు,సూర్యబ్యూరో :** ఏలూరు నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్లుగా 30వ డివిజన్ కార్పొరేటర్ పప్పు ఉమామహేశ్వరరావు, 47వ డివిజన్ కార్పొరేటర్ వందనాల దుర్గాభవాని ఏకగ్రీవంగా ఎన్నిక య్యారు. స్థానిక ఏలూరు నగరపాలక సంస్థ సమావేశపు హాలులో సోమవారం జిల్లా జాయింట్ కలెక్టర్, ప్రిసైడింగ్ అధికారి పి.ధాత్రిరెడ్డి ఆధ్వర్యంలో డిప్యూటీ మేయర్ల ఎన్నిక కార్యక్రమం జరిగింది.ఏలూరు నగరపాలక సంస్థలో ఖాళీగా ఉన్న రెండు డిప్యూటీ మేయర్ స్థానాలకు ఎన్నికల కమిషన్ ఆదేశాలమేరకు సోమవారం ఎన్నిక ప్రక్రియ జరిగింది. కార్యక్రమానికి 30మంది కార్పొరేటర్లు హాజరయ్యారు. ఏలూరు నగరపాలక సంస్థలో ఖాళీగా ఉన్న రెండు డిప్యూటీ మేయర్ స్థానాలకు 30వ డివిజన్ కార్పొరేటర్ పప్పు ఉమామహేశ్వరరావు, 47వ డివిజన్ కార్పొరేటర్ వందనాల

- తరువాయి 2లో..



### బాలికలకు

# భరోసానిద్దాం

**సమాన హక్కులు కల్పించి**
**సమాజంలో గౌరవంగా ఎదగనిద్దాం..**
**ఆడపిల్లల ఆత్మరక్షణ మనఅందరి సామాజిక బాధ్యత**

**పెనుమంట్ర,మేజర్‌న్యూస్:** బాలికలకు అన్ని విధాలుగా అండగా నిలవడంతోపాటు, వారి బంగారు భవిష్యత్తుకు సమిష్టిగా కృషి చేయాలని జిల్లా కలెక్టరు చదలవాడ నాగరాణి అన్నారు. మండలం మార్టేరు నెగ్గిపూడి గ్రామం శ్రీవేణుగోపాలస్వామి ఉన్నత పాఠశాలలో ఆడపిల్లల ఆత్మరక్షణ కార్యక్రమాన్ని సోమవారం జిల్లాకలెక్టరు చదలవాడ నాగరాణి జిల్లాలో మొట్టమొదటిగా లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు మాట్లాడుతూ రాణి లక్ష్మీబాయి ఆత్మరక్ష ప్రసిక్షన్ శిక్షణ కార్యక్రమాలు జిల్లాలో ఈ రోజు నుండి మార్చి 15 వ తేదీ వరకు 32 రోజులు పాటు పని దినాలలో ప్రతి పాఠశాలలో రోజుకు ఒక గంట చొప్పున 20 రోజులు పాటు, జిల్లాలో ప్రతి పాఠశాలలో జరిగేలా చర్యలు తీసుకున్నామని, మార్చి 15 వ తేదీలోగా పూర్తయ్యేలా కార్యక్రమాన్ని డిజైన్ చేశామన్నారు. రూపేష్ వెల్ఫేరు సొసైటీ నుండి 50 మంది కరాటే ఉపాధ్యాయులను కేటాయించామన్నారు. కార్యక్రమం ముఖ్య ఉద్దేశం బాలికలు విద్యలో రాణించడంతోపాటుబలంగా ఉండటం, ఆత్మవిశ్వాసంతో సాధికారత అవగాహన కల్పించడం

- తరువాయి 2లో..

# నూజివీడు మున్సిపల్ వైస్ చైర్మన్ టిడిపి వశం

**మరోసారి పగడాలకే పట్టాభిషేకం**
**ఫలించిన మంత్రి పార్థసారథి మంత్రాంగం**
**టిడిపిలో చేరిన పదిమంది వైసీపీ కౌన్సిలర్లు**





**నూజివీడు,మేజర్‌న్యూస్ :** రసవత్తరంగా మారిన నూజివీడు మున్సిపల్ వైస్ చైర్మన్ ఎన్నిక కొన్ని ఆసక్తి పరిణామాల మధ్య జరిగింది.

- తరువాయి 2లో..

# విచ్చలవిడిగా గ్రావెల్ అక్రమ రవాణా..

**కొయ్యలగూడెం -నల్లజర్ల మండలాల సరిహద్దులో**
**సుభద్రపాలెం మెట్ట లూటీ**
**పట్టించుకోని సంబంధిత శాఖల అధికారులు**

- మిగతా 8 లో..

# ఎమ్మెల్సీ ఎన్నిక నిర్వహణకు రాజకీయ పార్టీలు సహకరించాలి

**10 వరకు నామినేషన్లు స్వీకరణ**
**27న పోలింగ్, మార్చి 3న కౌంటింగ్**

- మిగతా 8 లో..

# ఎన్డీఏ కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి 'పేరాబత్తుల' విజయం ఖాయం

### కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ





**భీమవరం,మేజర్‌న్యూస్ :** తూర్పు పశ్చిమగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎన్నికలలో ఎన్డీఏ కూటమి అభ్యర్థి పేరబత్తుల రాజశేఖరం విజయం ఖాయమని భారీ ఉక్కు పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస్ వర్మ తెలిపారు.భీమవరం నియోజకవర్గ తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో నియోజకవర్గ ఇన్చార్జ్ పోలిట్ బ్యూరో సభ్యురాలు తోట సీతారామలక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన నియోజకవర్గ కూటమి ముఖ్య నాయకుల సమావేశంలో కేంద్రమంత్రి శ్రీనివాస్ వర్మ మాట్లాడుతూ ఫిబ్రవరి 27వ తేదీన నిర్వహించు పట్టభద్రుల శాసనమండలి సభ్యుని ఎన్నికకు ప్రతి 30 మంది ఓటర్లకు కూటమి ప్రతినిధి నియమించి తద్వారా ఎన్నికలప్రచారం నిర్వహిస్తూ వారితో కూటమిఅభ్యర్థి పేరబత్తుల రాజశేఖరంకి మొదటి ప్రాధాన్యత ఓటు వేయించి అభ్యర్థి విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఏపీఐఐసీ చైర్మన్ జిల్లా టిడిపి అధ్యక్షుడు మంతెన రామరాజు మాట్లాడుతూ గ్రామాలు ప్రాంతాలు వార్డుల వారీగా ఓటర్ల జాబితాను విభజించిఅభ్యర్థి విజయానికి శక్తి వంచన

- తరువాయి 2లో..

# బాలికలకు భరోసానిద్దాం

మొదటిపేజీ తరువాయి

జరుగుతుందన్నారు. బాలికలు తమను తాము రక్షించుకునే నైపుణ్యాలు, విశ్వాసంతో సాధికారత కల్పించేందుకు రూపొందించ బడిన పరివర్తనాత్మక స్వీయ-రక్షణ శిక్షణా కార్యక్రమం అన్నారు. ఈ చొరవ శారీరక ఆత్మరక్షణపై దృష్టి పెట్టడమే కాకుండా బాలికలలో భద్రత, అవగాహన, స్థితిస్థాపకత భావాన్ని కలిగించడం కూడా లక్ష్యంగా ఈ కార్యక్రమం జరుగు తుందన్నారు. మాస్టరింగు సెల్ఫ్- డిఫెన్స్ - జూడో, టైక్వాండో, కరాటేలో బలం, చురుకుదనం పెంపొందించడానికి శిక్షణ ఇస్తుందన్నారు. ప్రమాదాన్ని ముందుగానే గుర్తించడం, అసురక్షిత పరిస్థితులను గుర్తించడం, సమర్థ వంతంగా స్పందించడం ఎలాగో నేర్చుకోవాలో తెలియజేస్తారన్నారు. తమ కోసం, ఇతరుల కోసం నిలబడటం,బాలికలలో ధైర్యం సంఘీభావాన్ని ప్రోత్సహించడం జరుగు తుందన్నారు. సపోర్ట్ సిస్టమ్‌లకు యాక్సెస్, మహిళల హెల్ప్‌లైన్‌లు, చట్టపరమైన వనరుల వినియోగంపై బాలికలకు అవగాహన కల్పించడం జరుగుతుందని అన్నారు. హెల్తీ వర్సెస్ అన్‌హెల్తీ బిహేవియర్‌ని అర్థం చేసుకోవడం,వ్యక్తిగత భద్రత మరియు శ్రేయస్సు గురించి అవగాహన ప్రతి ఒక్కరికీ కల్పించడం జరుగుతుందని తెలిపారు. పశ్చిమ గోదావరి జిల్లాలో ఈ శక్తివంతమైన కార్యక్రమం 80 ప్రాథమికోన్నత పాఠశాలలు, 230 ఉన్నత పాఠశాలలకు చేరుకుంటుందని, 6 నుండి 9 తరగతుల వరకు సుమారు 25 వేల మంది బాలికలకు ప్రయోజనం చేకూరుస్తోందని తెలిపారు. ఈ శిక్షణ ద్వారా ఈ యువకులు ఆత్మరక్షణ నైపుణ్యాలను మాత్రమే కాకుండా నావిగేట్%ం% చేయగల విశ్వాసాన్ని కూడా పొందుతారని, ప్రపంచం నిర్భయంగా ఈ కార్యక్రమం కేవలం శిక్షణ కంటే ఎక్కువ ప్రతి అమ్మాయికి సురక్షితమైన, బలమైన మరియు మరింత సాధికారత కలిగిన భవిష్యత్తు వైపు ఉద్యమంలా శిక్షణ సాగుతుందన్నారు.ప్రతి విద్యార్థిని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఆడపిల్లలు ఆత్మరక్షణ శారీరక మరియు మానసిక దృఢత్వాన్ని అలవర్చు కుంటారని,ప్రతి సమస్యని ఒంటరిగా ఏ విధంగా పరిష్కరించుకోవాలో ఏ విధంగా ఆత్మస్థైర్యంతో జీవితంలో ముందుకు వెళ్లాలో అవగాహన కల్పిస్తారని అన్నారు. 18 ఏళ్ల వచ్చేవరకు చదువు మానేయకుండా ముందుకు వెళ్ళాలని, సెల్ ఫోన్లు,టాబ్లు చూడటం తగ్గించాలని కాలం విలువ తెలుసుకుని నిరంతరం చదువుపై శ్రద్ధ పెట్టాలని అన్నారు. బాలికలకు సామాజికంగా,ఆర్థికంగా, మానసికంగా భరోసానిచ్చి అండగా ఉండాలని పిలుపు నిచ్చారు. బాలికలకు అన్ని విధాలా భరోసా ఇచ్చి వారికి మంచి భవిష్యత్తును కల్పించేందుకు అన్ని విధాలుగా కృషి చేద్దామన్నారు. జిల్లా యంత్రాంగం తరపున బాలికలకు సంపూర్ణ సహకారాన్ని,భద్రతను అందిస్తామని హామీ ఇచ్చారు. బాలికలు, మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టడానికి ప్రతి ఒక్కరూ కృషి చేసినప్పుడే మంచి ఫలితాలు వస్తాయన్నారు. బాలికల సాధికారత కోసం అత్యంత శక్తివంతమైన సాధనాల్లో విద్య ఒకటని, ఉద్యోగ ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకుని ఆరోగ్య వంతమైన జీవితాలను గడుపుతారన్నారు. ఉన్నత చదువు వలన వివాహాన్ని ఆలస్యం చేసే అవకాశం ఉందని, తక్కువ పిల్లలను కలిగి ఉండి పేదరికంలేని సమాజ నిర్మాణానికి దోహదపడుతుందని అన్నారు. బాలికలు వారు కోరుకున్న చదువులు,ఆరోగ్యంతో పాటు రక్షణ కల్పిస్తే నవసమాజ నిర్మాణానికి పునాది పడుతుంది అని జిల్లా కలెక్టరు చదలవాడ నాగరాణి అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఇ.నారాయణ,సర్వశిక్ష అభియాన్ ఏపిసి పి.శ్యామ్ సుందర్,కమ్యూనిటీ ఇన్స్టూషన్ అధికారి వై.చంద్ర శేఖర్,తహశీల్దారు ఏ.వై. రవికుమార్,యంపిడివో పి.శామ్యూల్,మండల విద్యాశాఖ అధికారులు ఉంగరాల నాగేశ్వరరావు, వై.లక్ష్మీనారాయణ, ప్రధానోపాధ్యాయులు సి.హెచ్.చిన సూర్యనారాయణ రెడ్డి, విశ్రాంత ఫిజికల్ డైరెక్టరు కర్రి కృష్ణారెడ్డి,పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ జాలెం చిన్న, ఉపాధ్యాయులు,నాన్ టీచింగు సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు వారి తల్లిదండ్రులు,తదితరులు పాల్గొన్నారు.

## ఎన్డీఏ కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి 'పేరాబత్తుల' విజయం ఖాయం

మొదటిపేజీ తరువాయి

లేకుండా పని చేయాలన్నారు .నియోజకవర్గ ఇన్చార్జ్ తోట సీతారామలక్ష్మీ మాట్లాడుతూ మూడు పార్టీల నాయకులు ఉమ్మడి కార్యాచరణతో సమిష్టి కృషితో ఎన్నికల వ్యూహంతో కలిసి పని చేద్దాం అన్నారు. ఈసమావేశంలో ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకుడు మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగజగదీశ్వరరావు టిడిపి నియోజకవర్గ పరిశీలకుడు దాసరి ఆంజనేయులు టిడిపి రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారథి రాష్ట్ర కార్యదర్శులు కోళ్ల నాగేశ్వరరావు వేండ్ర శ్రీనివాస్ వీరవాసరం ఎంపీపీ వీరవల్లి దుర్గభవాని టిడిపి జనసేన బిజెపి ఉమ్మడి ఎన్డిఏ కుటమి నాయకులు మెరగాని నారాయణమ్మ గుల్లపల్లి విజయలక్ష్మి సయ్యద్ నసీమా బేగం ఆకుల మౌనిక యళ్లబండి ఇందిరా ఎండి షబీనా గంధం రాధ ఇందుకూరి సుబ్రహ్మణ్యరాజు గూడూరి సుబ్బారావు కొల్లేపర శ్రీనివాస్ రేవు వెంకన్న కుప్పాల వీరవెంకటనరసింహారావు కొయ్యలగడ్డ గణపతి కడలి వాసు పంపన సుధాకర్ మోకా శ్రీనివాస్ రాట్నాల సత్యనారాయణ వేండ్ర దివాకర్ లీలా కృష్ణ బాలాజీ గంటా త్రిమూర్తులు ఎద్దు ఏసుపాదం కోళ్ల నాగబాబు బొడ్డు మోహన్ పాలా శ్రీరామదాసు వీరవల్లి చంద్రశేఖర్ యరకరాజు గోపాల కృష్ణంరాజు నేదునూరి గంగాధర్ మరపట్ల శ్యాంబాబు గ్రామ వార్డు,క్లస్టర్,యూనిట్ బూత్ ఇన్చార్జిలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## డిప్యూటీ మేయర్ ఉమామహేశ్వరరావు బాధ్యతల స్వీకారం



**ఏలూరు,మేజర్ న్యూస్** :ఏలూరు మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ గా ఎన్నికైన పప్పు ఉమామహేశ్వరరావుకు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో తనకు కేటాయించిన చాంబర్లో సోమవారం సాయంత్రం ఆశీనులయ్యారు. నగరపాలక సంస్థ కో-ఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు ,పలువురు కార్పొరేటర్లు,అధికారులు,స్నేహితులు ఉమామహేశ్వరరావుకు శుభాకాంక్షలు తెలియజేశారు.

## కాలవలో కోళ్ల కళేబరాలు ఆందోళన చెందుతున్న ప్రజలు



**నరసాపురం రూరల్, మేజర్ న్యూస్ :** అంతుచిక్కని వ్యాధు లతో లక్షల సంఖ్యలో కోళ్లు మరణి స్తున్న విషయం తెలిసిందే. సోమవారం జున్నూరు కాలవలో మల్లవరం సమీపంలో కోళ్ల కళేబరాలు మూటలు కొట్టుకు వచ్చాయి. దీనిని గమనించిన వెలివేల నీటి సంఘం అధ్యక్షులు పులకండం వీర రాఘవులు నీటిపారుదల శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. నీటిపారుదల శాఖడి. ఇ.వెంకట నారాయణ ఏఈ.మోహన కృష్ణ కాలువలో మూటలను పరిశీలించారు. వ్యాధులతో చనిపోతున్న కోళ్ల కళేబరాలను పంట కాలవలో పడవేయటం దుర్మార్గ మని వారన్నారు. ఈ కాలువ ద్వారా వెలివెల, మల్లవరం లంక, మల్లవరం, కొప్పర్రు, సే రే పాలెం తదితర గ్రామాలకు తాగునీరు, సాగునీరు సరఫరా అవుతుంది. కోళ్ల కళేబరాలు చూసిన ప్రజలు కూడా ఆందోళనకు గురయ్యారు. వ్యాధులతో చనిపోతున్న కోళ్లను వంటకాలంలో పడ వేయటం వల్ల ఆ నీరు త్రాగే వారికి కూడా రోగాలు వస్తాయని ఆందోళన చెందుతున్నారు. ఇదిలా ఉండగా కోళ్ల కళేబరాలను మూటలు కట్టి పంట కాలువలో వేసిన వారిపై చర్యలు తీసుకోవాలని నీటి సంఘం అధ్యక్షులు వీరరాఘవులు కోరారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు. పులఖండందుర్గారావు.మల్లువెంకటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

## గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి



**దెందులూరు, మేజర్ న్యూస్ :** దెందు లూరు మండలం కొవ్వలి వంతెన వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒక వ్యక్తి మృతి చెందాడు.

ఈ సమాచారంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని విచారణ ప్రారం భించారు. మృతి చెందిన వ్యక్తి వివరాలు, ఢీ కొట్టి వెళ్లిన వాహనం వివరాలు సేకరిస్తున్నారు.

## పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు ఒక నామినేషన్ దాఖలు

మొదటిపేజీ తరువాయి

స్వీకరణ మొదలవగా ఈనెల 10వరకు కలెక్టరేట్‌లో నామినేషన్లు స్వీకరిస్తారు. ఈనెల 8,9వ తేదీలు సెలవు రోజులు మినహా మిగిలిన రోజుల్లో ఉదయం 11గం.నుంచి మధ్యాహ్నం 3గం.వరకు ఏలూరు కలెక్టరేట్‌లో నామినేషన్లు స్వీకరిస్తారు.

ఈనెల 11న పరిశీలన,13వ తేదీమధ్యాహ్నం 3.గం.వరకు ఉప సంహరణకు గడువుంది. ఫిబ్రవరి 27న ఉదయం 8గం.నుంచి సాయంత్రం 4గం.వరకు పోలింగ్, మార్చి3న ఏలూరులో ఓట్ల లెక్కింపు చేపడతారు. ఎన్నికలకు సంబంధించి 440 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి.వీటిలో 3,15,261 మంది ఓటర్లు ఉన్నారు.

## ఏలూరు నగరపాలక సంస్థలో కొనసాగుతున్న టిడిపి హవా

మొదటిపేజీ తరువాయి

దుర్గాభవానిలు నామినేషన్లు దాఖలు చేశారు. 30వ డివిజన్ కార్పొరేటర్ పప్పు ఉమామహేశ్వరరావు ను డిప్యూటీ మేయర్ పదవికి 36వ డివిజన్ కార్పొరేటర్ భీమవరపు హేమసుందరి ప్రతిపాదించగా, 12 వ డివిజన్ కార్పొరేటర్ కర్రి శ్రీనివాసరావు బలపరిచారు. 47వ డివిజన్ కార్పొరేటర్ వందనాల దుర్గాభవానిని డిప్యూటీ మేయర్‌గా 37 డివిజన్ కార్పొరేటర్ పృధ్వి శారద ప్రతిపాదించగా 28వ డివిజన్ కార్పొరేషన్ తంగిరాల అరుణ బలపరిచారు.

డిప్యూటీ మేయర్ ఎన్నికలకు 30 మంది కార్పొరేటర్లు హాజరయ్యారు. కాగా వైసిపి కార్పొరేటర్లు ఎవరూ నామినేషన్లు దాఖలు చేయని కారణంగా డిప్యూటీ మేయర్లుగా ఎంపికైన పప్పు ఉమామహేశ్వరరావు, వందనాల దుర్గాభవానిలు డిప్యూటీ మేయర్లుగా ఏకగ్రీవంగా ఎంపికైనట్లు జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి ప్రకటించివారికి ధ్రువపత్రాలను అందించారు.

ఈసందర్భంగా పప్పు ఉమామహేశ్వరరావు, వందనాల దుర్గాభవానిలను ఏలూరు శాసనసభ్యులు బడేటి రాధాకృష్ణయ్య (చంటి), నగర మేయర్ షేక్ నూర్జహాన్, కోఆప్షన్ సభ్యులు ఎస్.ఎం.ఆర్.పెదబాబు, సహచర కార్పొరేటర్లు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏలూరు నగరపాలక సంస్థ కమీషనర్ భానుప్రతాప్, అదనపు కమీషనర్లు, ప్రభృతులు పాల్గొన్నారు.

## నూజివీడు మున్సిపల్ వైస్ చైర్మన్ టిడిపి వశం

మొదటిపేజీ తరువాయి

నూజివీడు మున్సిపల్ వైస్ చైర్మన్ గా వైసిపి నుండి గత రెండు సంవత్సరాలు పనిచేసిన పగడాల సత్యనారాయణ టిడిపిలో చేరి మరల వైస్ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. మొత్తం 32 కౌన్సిల్ సభ్యులు ఉన్న నూజివీడు మున్సిపాలిటీలో గత మున్సిపల్ ఎన్నికల్లో వైసిపి25, టిడిపి ఏడు స్థానాలను గెల్చుకుంది.. మున్సిపల్ చైర్మన్గా రామిశెట్టి త్రివేణి దుర్గ, వైస్ చైర్మన్ లుగా పగడాల సత్యనారాయణ, కొమ్ము వెంకటేశ్వరరావు ఉండగా రెండు సంవత్సరాల వైస్ చైర్మన్ పదవి ముగియడంతో ఆ పదవికి పగడాల సత్యనారాయణ రాజీనామా చేశారు.

వైస్ చైర్మన్ పదవికి ఎన్నికల సంఘం ఎన్నికలు నిర్వహించడానికి నేరు ఏర్పాట్లు చేయగా 25 మంది కౌన్సిల్ సభ్యులుగా ఉన్న వైసీపీ కౌన్సిలర్లలో వైస్ చైర్మన్ పగడాల సత్యనారాయణతో పాటు 9 మంది టిడిపిలో చేరి వైస్ చైర్మన్ గా మరల పగడాల సత్యనారాయణ ను నామినేట్ చేయగా టిడిపి సభ్యులతోపాటు వైసీపీ నుండి టిడిపిలోకి వచ్చిన 10 మంది మొత్తం 17 మంది పగడాల సత్యనారాయణకు ఓటు వేయగా స్థానిక ఎమ్మెల్యే, మంత్రి కొలుసు పార్థసారధి ఓటుతో 18 ఓట్లు రాగా వైసిపి అభ్యర్థి నాగమల్లేశ్వరరావుకు 14 ఓట్లు వచ్చాయి.. దీనితో ఎన్నికల అధికారి టిడిపి వైస్ చైర్మన్ గా పగడాల సత్యనారాయణను ప్రకటించారు.

దీనితో నూజివీడు మున్సిపల్ కౌన్సిల్లో టిడిపి బలం 17 మందికి చేరగా వైసీపీ బలం 14 మందికి చేరింది. ఎన్నికల అధికారిగా వ్యవహరించిన నూజివీడు సబ్ కలెక్టర్ స్మరణ రాజు నూజివీడు పురపాల సంఘం వైస్ చైర్మన్ గా పగడాల సత్యనారాయణ ఎన్నికైనట్లు ధృవీకరణ పత్రం అందజేశారు.

# ఆపదలో ఉన్న విద్యార్థికి ఆపన్న హస్తం

## హెచ్ఎం రాయపూడికి అభినందనలు



**పాలకొల్లు,మేజర్‌న్యూస్:** జి.బి.ఎస్.వి.ఆర్.ఎం.మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో రెండవ తరగతి చదువుతున్న కుశల్ ఈశ్వర్ (7) ఇటీవల, ఉండి నియోజకవర్గం ఉండి గ్రామంలో నిర్వహించిన భోగి పండుగ వేడుకలలో అనుకోని విధంగా, భోగి మంటల్లో పడి, అగ్నికీలలలో చిక్కుకుని, తీవ్ర గాయాల పాలైన విషయం తెలిసిందే. ఈ విషయం పాఠశాల హెచ్ఎం భవాని ప్రసాద్ రాయపూడి ని తీవ్రంగా కలచివేసింది. తనదైన శైలిలో, విద్యార్థికి అన్ని విధాల అండగాలనిచారు హెచ్ఎం భవాని ప్రసాద్. 80 శాతానికి పైగా విద్యార్థి ఈ ఘటనలో కాలిపోయింది. ప్రస్తుతం సదరు విద్యార్థి భీమవరంలోని సాయి సుగిత్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. విద్యార్థిది పేద కుటుంబం కావడంతో, విద్యార్థికి అత్యుత్తమ చికిత్స అందించడంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విషయం తెలుసుకున్న రాయపూడి భవాని ప్రసాద్, బాధితుడికి వారు తల్లిదండ్రులకు అన్ని విధాల అండగా ఇచ్చారు. విద్యార్థిని స్వయంగా పరామర్శించారు. యూఏఈ శెట్టిబలిజ ఐక్య సంఘం నుండి రూ.34,350 లను విరాళంగా సేకరించి సోమవారం బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. అదేవిధంగా హాస్పిటల్ మెడికల్ బిల్లులకు సంబంధించి రూ. 20వేలను, వంశీకృష్ణ బెంగళూరు వారు కొయ్యలగూడెం మండలం కన్నాపురం గ్రామానికి చెందిన జనసేన నాయకులు మిత్రులు హాస్పిటల్ మెయింటినెన్స్ నిమిత్తం రూ 14వేల లను, ఇతర ఫ్రెండ్స్ . కోయిలగూడెం. మిత్రులు తదితరులు అందరూ కలిసి ఒక (యూఏఈ శెట్టి బలిజ ఐక్యవేదిక) వారితో కలుపుకొని ) 1లక్ష 15 వేల రూపాయలను మొత్తం 1లక్షా 49వేల రూపాయలను బాధిత విద్యార్థి వైద్య ఖర్చుల నిమిత్తం పాఠశాల హెచ్ఎం రాయపూడి భవాని ప్రసాద్ చేతుల మీదుగా విద్యార్థి సమక్షంలో తల్లిదండ్రులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ చైర్మన్ కే.పాపారావు, వైస్ చైర్మన్ సున్నం కళ్యాణి, ప్రభాకర్, లక్ష్మి అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమెరుగైన వైద్యం అందించండి: మంత్రి నిమ్మల ఎ

భోగిమంటలో పడి 80 శాతం శరీరం కాలి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పాలకొల్లు జివిఎస్ వి ఆర్ ఎం మున్సిపల్ పాఠశాల విద్యార్థి కుశల్ ఈశ్వర్ పై ప్రత్యేక శ్రద్ధ వహించి మెరుగైన వైద్యం అందించాలని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు వైద్య సిబ్బందిని ఆదేశించారు. విద్యార్థికి సకాలంలో సహాయం చేసి, మెరుగైన చికిత్స అందించే విధంగా, దాతల సహకారంతో చిత్తశుద్ధితో కృషి చేస్తున్న హెచ్ఎం రాయపూడి భవాని ప్రసాద్ ను ప్రత్యేకంగా మంత్రి అభినందించారు.తన పూర్తి సహాయ సహకారాలను అందిస్తానని హామీ ఇచ్చారు. స్కూలు యాజమాన్య కమిటీ తల్లిదండ్రులు దాతలు వైద్య సిబ్బందిని కూడా మంత్రి అభినందించారు,

## రాష్ట్రపతి అవార్డు గ్రహీత జెస్సికి ఘన స్వాగతం, సత్కారం





**దెందులూరు, మేజర్‌న్యూస్:**రాష్ట్రపతి అవార్డు గ్రహీత ఇంటర్నేషనల్ స్కేటర్ మాత్రపు జెస్సి రాజ్‌కు సోమవారం స్వగ్రామం జోగన్న పాలెంతో పాటు గోపన్న పాలెం గ్రామాల్లో ఘన స్వాగతం లభించింది. జోగన్నపాలెంలో గ్రామ సర్పంచ్ పసుమర్తి రాజేశ్వరి గ్రామం మాజీ సర్పంచ్ పసుమర్తి ప్రభాకర్ రావు సొసైటీ మాజీ చైర్మన్ డాక్టర్ పసుమర్తి మధు గ్రామస్తులు పౌర సన్మానం చేశారు. జెస్సి నివాసంలో సిఎస్ఐ చర్చి కౌన్సిల్ చైర్మన్ రెవరెండ్ ఆనంద్ కొండ డీనరీ చైర్మన్ రఘువరన్ అలెగ్జాండర్ ప్యారిస్ పాస్టర్ జోగన్నపాలెం పాస్టర్ ఇతర గ్రామాల పాస్టర్లు ప్రత్యేక సన్మానంచేసి జ్ఞాపిక అందజేశారు. గోపన్న పాలెం ప్రభుత్వ వ్యాయామ విద్య కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ నతానియేలు, కళాశాల ఫిజికల్ డైరెక్టర్లు లెక్చరర్లు కళాశాల సిబ్బంది విద్యార్థులు రాష్ట్రపతి అవార్డు గ్రహీత జెస్సికి రహదారి నుంచి కళాశాల డయాస్ వరకు గౌరవ వందనం ఇచ్చారు. ఘనంగా సత్కరించి వ్యాయామ కళాశాల జ్ఞాపిక అందజేసి వ్యాయామ రంగంలో జెస్సిరాజ్ చిన్న వయసులో రాష్ట్రపతితో తీసుకోవడం బాలికలకు క్రీడాకారులకు గ్రామీణ ప్రాంతాలకు గర్వకారణం అన్నారు. ఎంతటి విజయానికి కారకులైన జెస్సీ తల్లిదండ్రులు సురేష్ రాధా లను అభినందించారు.

## మధ్యాహ్నం భోజనాన్ని రుచి చూసిన కమీషనర్



**నరసాపురం,మేజర్‌న్యూస్:** మునిసిపల్ కమీషనర్ ఎం అంజయ్య సోమవారం 12వ వార్డులో ఉన్న మునిసిపల్ యుపి ఇంగ్లీష్ మీడియం స్కూల్‌ను అకస్మిక తనిఖీ చేశారు.అటెండన్స్ రిజిస్టర్ పరిశీలించి ఉపాధ్యాయులు, విద్యార్థుల సంఖ్య శానిటేషన్, కరెంటు బిల్లులు, ఆయా లకి జీతాల బిల్లులు వాటి పై ఆరా తీసి వారికి బిల్లులు చెల్లించవలసినదిగా ఆదేశాలు జారీచేశారు. పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ ఎలా జరుగుతుందోనని ఆయన రుచి చూసి పరిశీలించారు. ఈకార్యక్రమంలో పలువురు మున్సిపల్ ఉద్యోగులు స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

# 'దేశం' ఇన్చార్జి రామరాజుపై అభిప్రాయ సేకరణ



**నర్సాపురం, మేజర్‌న్యూస్:** కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ పొత్తూరి రామరాజు పనితీరుపై ఆ పార్టీ అధినాయకత్వం ఐవిఆర్ఎస్ సిస్టం ద్వారా ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టింది. దీనిలో భాగంగా సోమవారం నియోజకవర్గంలోని అనేకమందికి ఫోన్లు వచ్చాయి. రామరాజు పనితీరు బాగుంటే ఒకటి నొక్కండి బాగా లేకపోతే రెండు నొక్కండి అని అడగటంతో ఈ విషయం చర్చనీయాంశంగా మారింది. 2019 సాధారణ ఎన్నికల అనంతరం అప్పటికే ఇన్చార్జిగా కొనసాగుతున్న మాజీ ఎమ్మెల్యే బండారు మాధవ నాయుడును తప్పించి ఆ పార్టీ రాష్ట్ర నాయకత్వం రామరాజుకి ఇంచార్జి బాధ్యతలు అప్పజెప్పింది. అప్పటినుండి ఆయన కొనసాగుతూ ఉన్నారు. ఐవిఆర్ఎస్ ద్వారా అభిప్రాయ సేకరణకు పార్టీ అధినాయకత్వం పూనుకోవటంతో అదే పార్టీలో కొనసాగుతున్న ఒక వర్గం ఇన్చార్జిని మార్చేస్తున్నారు అంటూ పుకార్లు సృష్టిస్తున్నారు. ఇటీవల జరిగిన సాధారణ ఎన్నికలకు ముందే రామరాజును తొలగిస్తున్నారంటూ ఈవర్గం ప్రచారం చేసింది. ఐవిఆర్ఎస్ ద్వారా అభిప్రాయం అడగడంతో ఒక అడుగు ముందుకు వేసి త్వరలో మార్చేస్తున్నారు అంటూ ప్రచారానికి దిగారు.

ఇదిలా ఉండగా తెలుగుదేశం పార్టీ అధినాయకత్వం రాష్ట్రవ్యాప్తంగా ఆ పార్టీ ఎమ్మెల్యేలు, ఇన్చార్జిల పనితీరుపై ఆ నియోజకవర్గాల ప్రజల అభిప్రాయాలు సేకరిస్తుందని పార్టీ సీనియర్లు చెబుతున్నారు.

సమాచారం కోసం పార్టీ వివరాలు సేకరిస్తుందని, కొంతమంది పనుగట్టుకుని దుష్ప్రచారం మొదలు పెట్టారని, ఈ దుష్ప్రచారం ఎప్పటి నుండో చేస్తున్నారని పార్టీ సీనియర్లు చెబుతున్నారు. ఏది ఏమైనా అభిప్రాయ సేకరణ నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారింది.

## ఆసుపత్రికి అజ్ఞాతదాత 6 వీల్ చైర్లు అందజేత



**ఏలూరు,మేజర్‌న్యూస్ :** ఏలూరు జిల్లా ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో రోగుల సౌకర్యార్థం సోమవారం ఒక అజ్ఞాత దాత 6 వీల్ చైర్స్‌ను అందించారని ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.ఎం.ఎస్. రాజు చెప్పారు. వీల్ చైర్స్ ను అందించిన దాత తన వివరాలు తెలియజేయవద్దని కోరారన్నారు. సదరు వీల్ చైర్ ను రోగులను వివిధ వార్డులకు తీసుకువెళ్లేందుకు వినియోగించడం జరుగుతుందన్నారు. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు, వైద్య సిబ్బంది రోగులకు మెరుగైన సేవలందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ విజయ లక్ష్మి, నర్సింగ్ సిబ్బంది ఎస్తేర్ రాణి, అమ్మాజీ, భారతి, ప్రభృతులు పాల్గొన్నారు.

## నాణ్యత లోపిస్తే సహించేది లేదు

### ఐటీడీఏ పీవో శ్రీరాములు నాయక్



**బుట్టాయిగూడెం, మేజర్‌న్యూస్ :** తరగతుల భవన నిర్మాణంలో నాణ్యత లోపిస్తే సహించేది లేదని ఐటీడీఏ పీవో కే శ్రీరాములు నాయక్ అన్నారు. మండలంలోని తెల్లం వారి గూడెం గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాలలో నిర్మిస్తున్న అదనపు తరగతుల భవనాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. నాణ్యతలో లోపం లేకుండా చూడాలని ఇంజనీరింగ్ శాఖ అధికారులను ఆదేశించారు. భవన నిర్మాణాలకు వాడుతున్న ఇటుక సిమెంట్ ఐరన్లను ఆయన పరిశీలించారు. అదే సమయంలో పాఠశాలలో భోజనం చేస్తున్న విద్యార్థినిల దగ్గరకు వెళ్లి ఆహార పదార్థాలపై ఆరా తీశారు. భోజనాలు ఏ విధంగా ఉన్నాయని విద్యార్థినిలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినిల కోసం వండిన వంటలను ఆయన పరిశీలించారు. ఆయనతోపాటు ఇంజనీరింగ్ అధికారులు ఉన్నారు.

## వసంత పంచమి పూజ మహోత్సవం



**కలిదిండి, మేజర్ న్యూస్:** వసంత పంచమిని పురస్కరించుకొని కలిదిండి ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ విద్యార్థిని, విద్యార్థులకు వసంత పంచమి పూజ మహోత్సవం నాడు అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈ సందర్భంగా పదవ తరగతి పబ్లిక్ ఎగ్జామ్స్ లో హాజరవుతున్న విద్యార్థులకు మరియు కొత్తగా స్కూల్లో అడ్మిషన్ తీసుకుంటున్న విద్యార్థిని, విద్యార్థులకు కలిపి కలిదిండి ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ నందు సరస్వతి పూజ నిర్వహించినారు. స్కూల్ కరస్పాండెంట్ సానా వెంకట రామారావు మీనా సరస్వతి మాట్లాడుతూ విద్యార్థులకు జ్ఞానంతో పాటు బుద్ధి యుక్తి క్రమశిక్షణ మరియు సమయపాలనతో పాటు భక్తిని కూడా పెంపొందించుకోవాలన్నారు. సరస్వతి విద్య చిన్న పెద్ద తేడా లేకుండా పుస్తకాలు అమ్మవారి దగ్గర పెట్టి ఆశీర్వదించి అక్షరాభ్యాసం చేయిస్తే పిల్లలు జ్ఞాన రాశులు అవుతారన్నారు. విద్యార్థులు పుస్తకాలను పెన్నులను అక్షరాలను పూజిస్తే విద్యాబుద్ధులు లభిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ కేజే పాండురంగారావు మరియు ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

# చదువరులను ఆకట్టుకోలేకపోతున్న శాఖ గంథ్రాలయాలు

**– పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలు కొరత**




**కొయ్యలగూడెం, మేజర్‌న్యూస్:**జాతీయ గంథ్రాలయ ఉద్యమం తరువాత గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పడిన శాఖా గంథ్రాలయాలు నిధులు కొరత, నిరుద్యోగులు, విద్యార్థులకు అవసరమయ్యే పోటీ పరీక్షల పుస్తకాల కొరతతో కొట్టుమిట్టాడుతున్నాయి. ఏళ్ల తరబడి వర్గోన్నతలు లేక కొయ్యలగూడెం, జంగారెడ్డిగూడెం వంటి కీలక పట్టణాలలో ఉన్న శాఖ గంథ్రాలయాలు అర్థ శతాబ్ధం కాలం దాటినా ఇప్పటికీ గ్రేడ్–3 కేటగిరిలోనే కొనసాగుతుండటం విశేషం. కొయ్యలగూడెం మండలంలో సుమారు ఐదువందలకు మందికి పైగా నిరుద్యోగులు, ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల పార్ట్ టైం ఉద్యోగులు ఉపాధ్యాయ పోటీ పరీక్షల అభ్యర్థులు, వివిధ పోటీ పరీక్షలకు సిద్ధమౌతున్నారు. అయితే, వారికి అవసరమైన తాజా సమాచారం గల పుస్తకాలు ఏవీ గ్రంథాలయాలకు సరఫరా కావటం లేదని, నిరుద్యోగులు వాపోతున్నారు. అంతేగాక తాము గ్రంథాలయంకు వచ్చి సంబంధింత పుస్తకాలు చదువుకోవటానికి ప్రస్తుత గ్రంథాలయ సమయాలు కూడా అనువుగా లేవని, ఆ పనివేళలను ప్రస్తుత పరిస్థితులకు చదువరుల అవసరాలకు అనువుగా సవరిస్తే ప్రయోజనకరంగా ఉంటుందని వారు కోరుతున్నారు. కొయ్యలగూడెం శాఖ గ్రంథాలయంలో ప్రభుత్వం నాలుగు సంవత్సరాల క్రితం సమకూర్చిన కంప్యూటర్ తో పాటు, దాతలు సమకూర్చిన కంప్యూటర్లు ఉన్నాయి. అవి మరమ్మత్తులకు లోనై గత 3 సంవత్సరాలుగా పనిచేయడం లేదు. తాగునీటి శుద్ధి యంత్రం కూడా ప్రభుత్వమే సమకూర్చింది. అదికూడా గత 3 ఏళ్లుగా పనిచేయడంలేదు. దాతలు సమకూర్చిన విద్యుత్ ఇన్వర్టర్ కూడా పనిచేయటం లేదు.

వీటి గురించి ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. వీటి మరమ్మత్తులు చేయించడంతో పాటు, వివిధ పోటీ పరీక్షలకు సిద్ధం కావటానికి ఉపయోగపడే తాజా సిలబస్‌తో ఉన్న పుస్తకాలను గ్రంథాలయాలకు సరఫరా చేయాలని పోటీ పరీక్షలదారులు కోరుతున్నారు. ఈ విషయమై స్థానిక గ్రంథపాలకురాలు యు.రాముడును మేజర్ న్యూస్ సంప్రదించగా పోటీ పరీక్షలకు హాజరయ్యే వారికి ఏ పుస్తకాలు అవసరమవుతాయో లిఖిత పూర్వకంగా తమకు ఇస్తే వాటిని అధికారులకు పంపిస్తామని, ఆ తరువాత ఉన్నతాధికారులకు వాటిని సరఫరా చేస్తారని చెప్పారు. మరమ్మత్తులకు లోనైన కంప్యూటర్లు, నీటిశుద్ధియంత్రం, విద్యుత్ ఇన్వర్టర్ గురించి కూడా ఉన్నతాధికారులకు తెలియచేయడం జరిగిందని ఆమె తెలిపారు.

# వై యన్ కళాశాలలో భారత ఉపఖండంపై సదస్సు

**నర్సాపురం,మేజర్‌న్యూస్:**స్థానిక శ్రీ వై యన్ కళాశాల చరిత్ర,రాజకీయ శాస్త్ర విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో ' భారత ఉపఖండం యొక్క పూర్వ చరిత్ర ' అనే అంశంపై అతిథి ఉపన్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. సోమవారం జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా యూనివర్శిటీ ఆఫ్ హైదారాబాద్ ప్రొఫెసర్ డా.కె.పి.రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ' మన భారత దేశ చరిత్ర సుమారు ఇరవై లక్షల సంవత్సరాల కాలం నాటిదని, పురావస్తు శాఖ త్రవ్వకాల ఆధారంగా దీనిని కనుగొనడం జరిగిందనీ, ఈ చరిత్ర కాలాన్ని రాతి యుగం, ఖనిజ యుగం అని రెండు కాలాలుగా చెప్పడం జరిగిందనీ, వాటిని మరలా మూడు విధాలుగా విభజించారని, అవి – పాలెయోలిథిక్ – పాత రాతి యుగం, మెసోలిథిక్ – మధ్య రాతి యుగం నియోలిథిక్ – ఆధునిక రాతి యుగం అనే కాలాలుగా విభజించి విభజించారన్నారు. వాటిని మరలా అనేక విభాగాలుగా చెప్పడం జరిగిందనీ, ఆయా కాలాల్లో మనిషి ఉపయోగించిన రాతి పనిముట్లు స్థానే ఈ కాలంలో మనిషికి కావలసిన విధంగా ఖనిజ పనిముట్లుగా మార్చామని, అనేక విధాలుగా మన భారత ఉపఖండం యొక్క పూర్వ వైభవాన్ని రెండు భాగాలుగా అనగా ఉత్తర,దక్షిణ భారత ప్రాంతాలుగా విభజిస్తూ, ఆయా ప్రాంతాల్లో ఏ విధంగా మానవులు తమ జీవితాన్ని గడిపారో ' విద్యార్థులకు తెలియచేశారు.



ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చింతపల్లి కనక రావు, డీన్ డాక్టర్ గంధం శ్రీ రామకృష్ణ, హెచ్. ఆర్.డి. డైరెక్టర్ డా.చినమిల్లి శ్రీనివాస్, హిస్టరీ హెడ్ ఎస్. సోమశేఖర్, పాలిటిక్స్ హెడ్ డా.కమ్మిల రంగారావు, ఫిజిక్స్ హెడ్ డా.అప్పన ఫణి, ఫిజిక్స్ అధ్యాపకులు డా. మల్లేశ్వర రావు, పరిమి రామకృష్ణ, సుందర్ సింగ్, ఐ.ఎల్. ఎం.సారంగపాణి, బయోటెక్ పుష్ప, మైక్రో బయాలజీ రాణి విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# ఫిజు పోరు దీక్షను విజయవంతం చేయండి

**వైసీపీ ఎంబీసీ విభాగం రాష్ట్ర అధ్యక్షులు పెంద్ర వీరన్న**



**నర్సాపురం రూరల్,మేజర్‌న్యూస్:** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వైయస్ జగన్మోహన్ రెడ్డి విద్యార్థుల పక్షాన పోరాటం చేస్తూ ఈనెల 5వ తేదీన అన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయాల వద్ద ఫీజు ఫోరు దీక్షకు పిలుపునిచ్చారని, ఈ దీక్షను జయప్రదం చేయవలసిందిగా వైసిపి ఎంబీసీ విభాగం రాష్ట్ర అధ్యక్షులు పెంద్ర వీరన్న కోరారు. సోమవారం మండలంలోని సీతారామపురంలో ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. మూడు త్రైమాసికాలుగా కూటమి ప్రభుత్వం ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు పెండింగ్ పెట్టి రాక్షసత్వం చేస్తూ,ఫీజులు కట్టకపోవడంతో కాలేజీల నుంచి విద్యార్థులను యాజమాన్యాలు వెళ్లగొడుతున్నారని అన్నారు.చదువులు మధ్యలో ఆగిపోతున్నా సర్కారు చోద్యం చూస్తుందని,కాలేజీలకు వెళ్లాల్సిన విద్యార్థులకు పొలాల బాట పట్టి కూలి పనులు చేసుకుంటున్న దుస్థితి ఏర్పడే విధంగా కూటమి ప్రభుత్వం చేసిందని పెంద్ర వీరన్న అన్నారు.పేద పిల్లలకు పెద్ద చదువులు సాకారం చేస్తూ ఫీజు రీయింబర్స్ మెంట్ పథకాన్ని తీసుకొచ్చిన ఘనత దివంగత నేత మాజీ సీఎం వైయస్ రాజశేఖర్ రెడ్డి కి దక్కుతుందని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.నిరుపేద ఇళ్ల నుంచి డాక్టర్లు, ఇంజనీర్లు, సైంటిస్టులు తయారు కావాలన్న లక్ష్యంతో నాడు ఫీజుకు శ్రీకారం చుట్టిన దివంగత వైయస్సార్ అని, ఆయన మరణానంతరం ఫీజు రీయింబర్స్ మెంట్ పథకాన్ని తర్వాత వచ్చిన కాంగ్రెస్ ,టిడిపి ప్రభుత్వాలు నిర్వీర్యంచేసిన ఘనత వారికే దక్కుతుందని ఆయన విమర్శించారు.చంద్రబాబు సర్కార్ 2014–19 మధ్యలో ఈ పథకాన్ని తుంగలోకితొక్కారని ఆయన,ఉద్దేశపూర్వకంగా బకాయిలు పెట్టి, కాలేజీ యాజమాన్యాలను, విద్యార్థులను ఇబ్బందులకు గురి చేసిందన్నారు.వైయస్సార్ బాటలో మరో రెండడుగులు ముందుకేసి 93 శాతం మంది పిల్లలకు మేలు చేసిన మాజీ సీఎం వైయస్ జగన్‌కి దక్కుతుందని వీరన్న అన్నారు. పేద పిల్లల భవిష్యత్తు కోసం జగన్మోహన్ రెడ్డి చేస్తున్న దీక్షలో ప్రజానీకమంతా పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు.

## భాష్యంలో వేడుకగా వసంత పంచమి





**పెనుగొండ,మేజర్‌న్యూస్:**స్థానిక కంబాల వారి వీధిలో గల భాష్యం పాఠశాలలో సోమవారం నాడు విద్యార్థులు జ్ఞానానికి, సంగీతానికి, కళలకు, దేవత– చదువుల తల్లి శ్రీ సరస్వతీదేవి జన్మదినమును మాఘమాసం శుక్లపక్షంలో 5వ రోజు పంచమతిథిన వసంత పంచమి లేదా శ్రీ పంచమి పేరుతో సకల విద్యా స్వరూపిణి,పరాశక్తి, జ్ఞానప్రదాయిని శ్రీ సరస్వతి దేవి అమ్మవారి కరుణాకటాక్షాలు అందరిపై ఉండాలని కోరుకుంటూ ఎంతో భక్తిశ్రద్ధలతో స్థానికంగా పేరొందిన శాస్త్ర పాండిత్య పురోహితులు మంగళంపల్లి ఆంజనేయ శర్మ నేతృత్వంలో విద్యార్థులంతా ప్రత్యేక పూజలను నిర్వహించారని ప్రిన్సిపల్ ఎన్ వి అప్పారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వీణాపాణి, పుస్తకాన్ని చేతబూని అపారమైన జ్ఞానాన్ని ప్రసాదించేటువంటి ఆ వాగ్దేవి జన్మదినమైన వసంత పంచమి రోజున అక్షరాభ్యాసం లేదా సరస్వతీ పూజ ఎంతో విశేషమైన ఫలితాన్ని ఇస్తుందని, ఆ దేవి వాక్పటిమ, జ్ఞాన పరిజ్ఞానం, చల్లని ఆశీస్సులు లభిస్తాయని తెలియజేశారు. అనంతరం మంగళంపల్లి ఆంజనేయ శర్మ చేతులతో అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాష్యం జోనల్ ఇంచార్జ్ శ్రీమన్నారాయణ రెడ్డి, చాంప్స్ ఇంచార్జ్ రాణి రోజాజీ ఉపాధ్యాయ ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.

## 5న ఆర్అండ్ఆర్‌పై ప్రజావేదిక



కుకునూర్. మేజర్‌న్యూస్ : ఐటీడీ ఏ ప్రాజెక్టు అధికారి ఆర్ అడ్ ఆర్ అధికారి అధ్యక్షున బుధవారం నాడు కుకునూర్ తాసిల్దార్ కార్యాలయంలో ఉదయం పది గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు ఆర్ అండ్ ఆర్ సమస్య ల పై దరఖాస్తు లు తీసుకోవడం జరుగుతుందని అందువల్ల ప్రజ లందరు ఈ అవకాశాన్ని వినివేగించు కోవాలాని తాసిల్దార్ రమేష్ బాబు ఒక ప్రకటనలో తెలియజేశారు

## కనుల పండుగగా శ్రీవారి కళ్యాణ మహోత్సవం

**సామూహిక కుంకుమ పూజలు, వైభవంగా గ్రామోత్సవం**





**పెనుగొండ/పోడూరు, మేజర్‌న్యూస్:**పోడూరు మండలం కొమ్ము చిక్కాలలో వేంచేసి ఉన్నశ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఏకాదశ వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి .మంగళవారం ఉదయం మాజీ మంత్రి ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ నిర్మించిన ఆలయంలో బ్రహ్మశ్రీ మానేపల్లి రామలింగేశ్వర శర్మ ఆశీస్సులతో శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వర స్వామికి ఏకదశ వార్షికోత్సవ భాగంగా శ్రీవారి కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. వైఖానస ఆగమ శాస్త్ర ప్రకారం మంగళ వాయిద్యాలు, వేద పండితుల మంత్రోచ్చారణ మధ్య స్వామివారి కళ్యాణం కనుల పండుగగా మాజీ మంత్రి ,ఆచంట శాసనసభ్యులు పితాని సత్యనారాయణ అనంత లక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో నిర్వహించారు. తొలుత ఆలయ ఆవరణలో శాంతి హెూమం నిర్వహించారు. లోక కళ్యాణార్థం లోక శాంతి కోసం హెూమాలు చేశారు.సామూహికంగా మహిళలు కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం భూదేవి శ్రీదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి గ్రామోత్సవం అంగరంగ వైభవంగా సాగింది. ప్రత్యేకంగా అలంకరించిన పల్లకిలో శ్రీవారి గ్రామోత్సవం విచిత్ర వేషధారణలు, వాయిద్యాలు , తీన్మార్ డప్పు విన్యాసాల నడుమ గ్రామోత్సవం కనుల పండుగగా జరిగింది.కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

# మార్చి 8వ తేదీన జాతీయ లోక్ అదాలత్

## జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్




**ఏలూరు,మేజర్‌న్యూస్:** రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి వారి ఆదేశాల ప్రకారం మార్చి 8వ తేదీ 2025న ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ తెలిపారు. సోమవారం ఏలూరు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ భవనము నందు ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్,జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆధ్వర్యంలో మార్చి 8వ తేదీన ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని అన్ని కోర్టుల పరిధిలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ జాతీయ లోక్ అదాలత్ నందు రాజీయోగ్యమైన అన్ని క్రిమినల్ కేసులు, సివిల్ కేసులు, వాహన ప్రమాద బీమా కేసులు, కుటుంబ వివాదాలు, చిట్ ఫండ్స్ వివాదాలు, బ్యాంకు లావాదేవీల కేసులు, టెలిఫోన్ బకాయిల కేసులు, మున్సిపల్ ఆస్తి మరియు నీటి పన్నుల కేసులను ఈ జాతీయ లోక్ అదాలత్ నందు రాజీ చేయడం జరుగుతుందని తెలియజేశారు. అలాగే ప్రతి శనివారం అన్ని కోర్టులలో ప్రీ లోక్ అదాలత్ సిటింగ్స్ నిర్వహిస్తున్నారని, పర్మినెంట్ లోక్ అదాలత్ చైర్మన్ ప్రతిరోజు ఉదయం 10:30 నుండి సాయంత్రం 5 గంటల వరకు కేసుల పరిష్కారానికి మధ్యవర్తిత్వ నిర్వహిస్తున్నారని ఏలూరు కోర్టు పరిధిలోని కేసులనే కాకుండా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని ఇతర కోర్టుల పరిధిలోని కేసులను కూడ ఆన్లైన్ విధానం ద్వారా ఈ మధ్యవర్తిత్వం ద్వారా హాజరై తమ కేసులను రాజీ చేసుకోవచ్చునని తెలిపారు. ఈ కేసులలో సమస్యలు ఎదురైన 08812-224555 ఫోన్ నెంబర్ ద్వారా సంప్రదించాలని తెలిపారు. గత డిశంబరు 14వ తేదీన నిర్వహించిన జాతీయ లోక్ అధాలతో వివిధ కేసులకు సంబంధించి 5,616 కేసులను పరిష్కరించుకొని కక్షిదారులు విముక్తి పొందారని, ఆదే విధంగా 2025 మార్చి 8వ తేదీన జాతీయ లోక్ అధాలత్‌కు 3,746 కేసులను పరిష్కారానికి మధ్యవర్తిత్వం ద్వారా గుర్తించారని తెలిపారు.

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పరిధిలో గల 11 మండల లీగల్ సర్వీసెస్ కమిటీలతో కూడా కేసులను పరిష్కరించుకోవడానికి ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అదే విధంగా ఇంకా కక్షిదారులు ఎవరైనా ఉంటే వారు కూడా మార్చి 8వ తేదీన జరిగే జాతీయ లోక్ అధాలత్ లో పరిష్కరించుకోవడానికి ముందుకు రావాలని తెలిపారు. కక్షి దారులు జాతీయ లోక్ అదాలత్ ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్ధి భీమేశ్వరరావు ఎన్నికల ప్రచారం





**చింతలపూడి,మేజర్‌న్యూస్ :** చింతలపూడి కోర్టులో బార్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ తమ్మిశెట్టి ఫణీదీఫ్ అసోసియేషన్ మెంబెర్స్ చైతన్య , నాగేశ్వరరావు , కిషోర్, ఇతర న్యాయవాదులను కలిసి ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎంఎల్సీ గా పోటీ చేస్తున్న తనకు మొదటి ప్రాధాన్యత ఓటును వేసి ఎంఎల్సీ గా గెలిపించ వల్సిందిగా కోరుతూ కరపత్రాలు పంపిణీ చేస్తూ చిక్కా భీమేశ్వరరావు విస్తృత ప్రచారం నిర్వహించారు.అనంతరం మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ చింతలపూడి అధ్యక్షులు ఆరేపల్లి అప్పారావు ని మర్యాద పూర్వకంగా కలసి మద్దతు కోరగా ఆయన సానుకూలంగా స్పందించారని భీమేశ్వరరావు తెలిపారు.

# అందుబాటులో ఉంచిన ఇసుక నిల్వలు సద్వినియోగం చేసుకోవాలి



**భీమవరం, మేజర్‌న్యూస్:**జిల్లా ప్రజల అవసరాలకు స్టాక్ పాయింట్లలో అందుబాటులో ఉంచిన ఇసుక నిల్వలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి కోరారు.జిల్లాలో ఇసుక రీచ్ లు అందుబాటులో లేనందున జిల్లాస్థాయి ఇసుక కమిటీ ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని తీపర్రు-2 ఇసుక రీచ్ నుండి ఇసుకను ఆచంట, పాలకొల్లు, తాడేపల్లిగూడెం, తణుకు, నరసాపురం, ఉండి నియోజకవర్గ ప్రధాన కేంద్రాలకు ఇసుక తరలించి, స్టాక్ పాయింట్ ద్వారా అమ్మకాలు చేపట్టడానికి నిర్ణయించి ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించడం జరిగిందన్నారు. ఆచంటలో మెట్రిక్ టన్ను ఒక్కింటికి రూ.295 లు చెల్లించి ఇసుకను పొందవచ్చు అని, ప్రస్తుతం 200 మెట్రీక్ టన్నులు స్టాక్ పాయింట్ నందు అందుబాటులో ఉందన్నారు. ఆచంట స్టాక్ పాయింట్ ను కే వి వి ఎస్ ఎన్ ఇన్ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్ వారు నిర్వహిస్తున్నారని స్టాక్ పాయింట్ ఇంచార్జ్ లు సెల్ నెంబర్లు.. 95506 28544, 93918 11436 నందు సంప్రదించవచ్చున్నా రు.పాలకొల్లులో మెట్రిక్ టన్ను ఒక్కింటికి రూ.320/- లు చెల్లించి ఇసుకను పొందవచ్చు అని, ప్రస్తుతం 220 మెట్రీక్ టన్నులు స్టాక్ పాయింట్ నందు అందుబాటులో ఉందన్నారు. పాలకొల్లు స్టాక్ పాయింట్ ను మైత్రి ఇన్ఫ్రా వారు నిర్వహిస్తున్నారని స్టాక్ పాయింట్ ఇంచార్జ్ లు సెల్ నెంబర్లు.. 99892 41197, 91771 15571ల నందు సంప్రదించవచ్చున్నారు తాడేపల్లిగూడెంలో మెట్రిక్ టన్ను ఒక్కింటికి రూ.300 లు చెల్లించి ఇసుకను పొందవచ్చు అని, ప్రస్తుతం 100 మెట్రీక్ టన్నులు స్టాక్ పాయింట్ నందు అందుబాటులో ఉందన్నారు. తాడేపల్లిగూడెం స్టాక్ పాయింట్ ను శ్రీ దుర్గా కన్స్ట్రక్షన్స్ వారు నిర్వహిస్తున్నారని స్టాక్ పాయింట్ ఇంచార్జ్ లు సెల్ నెంబర్లు.. 63030 25769, 82472 30369 ల నందు సంప్రదించవచ్చున్నా రు.తణుకులో మెట్రిక్ టన్ను ఒక్కింటికి రూ.215- లు చెల్లించి ఇసుకను పొందవచ్చు అని, ప్రస్తుతం 20 మెట్రీక్ టన్నులు స్టాక్ పాయింట్ నందు అందుబాటులో ఉందన్నారు. తణుకు స్టాక్ పాయింట్ ను శ్రీ వర్ధన్ కన్స్ట్రక్షన్స్ వారు నిర్వహిస్తున్నారని స్టాక్ పాయింట్ ఇంచార్జ్ లు సెల్ నెంబర్లు.. 86888 18124, 93900 69686ల నందు సంప్రదించవచ్చున్నారు

నరసాపురంలో మెట్రిక్ టన్ను ఒక్కింటికి రూ.370 లు చెల్లించి ఇసుకను పొందవచ్చు అని, ప్రస్తుతం 160 మెట్రీక్ టన్నులు స్టాక్ పాయింట్ నందు అందుబాటులో ఉందన్నారు. నరసాపురం స్టాక్ పాయింట్‌ను మైత్రి ఇన్ఫ్రా వారు నిర్వహిస్తున్నారని స్టాక్ పాయింట్ ఇంచార్జ్‌లు సెల్ నెంబర్లు.. 88972 37839, 93467 12492ల నందు సంప్రదించవచ్చున్నారు

ఉండిలో మెట్రిక్ టన్ను ఒక్కింటికి రూ.440 లు చెల్లించి ఇసుకను పొందవచ్చు అని, ప్రస్తుతం 200 మెట్రీక్ టన్నులు స్టాక్ పాయింట్ నందు అందుబాటులో ఉందన్నారు. ఉండి స్టాక్ పాయింట్ ను మైత్రి ఇన్ఫ్రా వారు నిర్వహిస్తున్నారని స్టాక్ పాయింట్ ఇంచార్జ్ లు సెల్ నెంబర్లు.. 95152 30498, 94929 39276 ల నందు సంప్రదించవచ్చున్నా రు.ఇసుక కావలసిన వినియోగదారులు తమ వివరాలను %ఖఅస.ఖజూ.స్త్రఅజ.ఱఅ% వెబ్సైట్లో నమోదు చేసుకొని, రిజిస్ట్రేషన్ కాపీని ఇసుక నిల్వ కేంద్రం వద్ద చూపించి ఇసుకను పొందవచ్చని లేదా నేరుగా ఇసుక నిలువ కేంద్రానికి వెళ్లి ఆధార్ కార్డును చూపించి రిజిస్ట్రేషన్ చేయించుకోవచ్చు అన్నారు. అప్పుడు స్టాక్ పాయింట్ ఇంచార్జ్ డిజిటల్ పేమెంట్ చేయించుకుని ఇసుకను సరఫరా చేయడం జరుగుతుందని తెలిపారు. జిల్లా ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి కోరారు.

# మాదక ద్రవ్యాల అక్రమ కట్టడికి కఠిన చర్యలు తీసుకుంటున్న కేంద్రం

## ఎంపీ పుట్టా మహేష్ ప్రశ్నకు లిఖిత పూర్వకంగా సమాధానం ఇచ్చిన కేంద్ర ఆర్థిక మంత్రి పంకజ్ చౌదరి



**ఏలూరు,సూర్యబ్యూరో :** దేశంలో మాదకద్రవ్యాల అక్రమ రవాణా కట్టడికి కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి తెలిపారు.

గత ఐదేళ్లలో దేశవ్యాప్తంగా, ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో, మాదక ద్రవ్యాల అక్రమ రవాణా కట్టడికి కేంద్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలపై ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ అడిగిన ప్రశ్నకు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి సోమవారం లిఖితపూర్వకంగా సమాధానం ఇచ్చారు.దేశంలో, ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో గత 5 ఏళ్లలో మాదక ద్రవ్యాల అక్రమ రవాణాకు సంబంధించి ప్రత్యేకంగా ఎలాంటి సర్వే చేయలేదని, నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో మాదక ద్రవ్యాల సీజ్‌లకు సంబంధించి అన్ని డ్రగ్‌లా ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీల నుండి సమాచారం సేకరిస్తుందని తెలిపారు.గత ఐదేళ్లలో ఓడరేవులలో రూ.11,669 కోట్ల విలువైన మాదక దవ్యాలను సీజ్ చేయగా, దేశవ్యాప్తంగా రూ.1.03 లక్షల కోట్ల విలువైన మాదక ద్రవ్యాలను సీజ్ చేశామని, ఆంధ్రప్రదేశ్ లో 21,048 కేసులు నమోదు చేసినట్లు కేంద్ర మంత్రి పేర్కొన్నారు.

మాదక ద్రవ్యాల వినియోగం వలన కలిగే అనర్థాల పట్ల అవగాహన కల్పించడంతో ఆధ్యాత్మికతవైపుయువతను మళ్లించేలా చైతన్య పరిచేందుకు వీలుగా ఎన్.సి.బి మిషన్ స్పందన్‌తో పాటు మరో ఐదుసంస్థలతో కేంద్ర ప్రభుత్వం ఎం.ఓ.యు కుదుర్చుకుందని మంత్రి స్పష్టం చేశారు.2021-22 సంవత్సరంలో అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఆంధ్ర, ఒడిశా సరిహద్దులో గంజాయి తోటలను నాశనం చేయడానికి 'పరివర్తన' ఆపరేషన్ ప్రారంభించబడిందని, పంట నాశనం ఆపరేషన్ 8 దశల్లో చేపట్టి, రూ. 9250 కోట్ల విలువైన 7552 ఎకరాల్లో గంజాయి ధ్వంసం చేసి, 17,278 మందిని ఎన్ డి పి ఎస్ చట్టం కింద అరెస్ట్ చేసినట్లు కేంద్ర మంత్రి తెలిపారు. మాదకద్రవ్యాల వినియోగం వలన కలిగే అనర్థాలు, బానిసలుగా మారితే తదుపరి పర్యవసానాలపై విద్యార్థులువారి తల్లిదండ్రుల కు జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు, అలాగే ప్రతి ఏటా జూన్ 26న మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణాకు వ్యతిరేకంగా అంతర్జాతీయ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు మంత్రి సమాధానం ఇచ్చారు.

ఎన్.ఎఫ్.సి.డి.ఏ మార్గదర్శకాలలో సూచించిన విధంగా మాదకద్రవ్యాల బారిన పడిన వారిని ఆదుకునేందుకు నేషనల్ ఫండ్ ఫర్ కంట్రోల్ ఆఫ్ డ్రగ్ అబ్యూజ్ కింద రూ. 2.09 కోట్లు మంజూరు చేసినట్లు కేంద్ర సహాయ మంత్రి బదులిచ్చారు.

# పారిశుధ్యాన్ని మెరుగుపరచాలి

## : ఎంపీడీఓ



**లింగపాలెం,మేజర్‌న్యూస్** :మండల పరిధిలోని 22 గ్రామపంచాయతీలలో పారిశు ధ్యాన్ని మ రింతగా మెరుగు పరచాలని, ప్రతిరోజు తడి, పొడి చెత్త సేకరించాలని ఎంపీ డీవో వాణి ఆదేశించారు.

అలాగే డంపింగ్ యార్డ్‌లలో చెత్త వేయాలని సూచిం చారు. రోడ్లకు ఇరువైపులా చెత్తచెదారం పడవేయ కుండా చూడాలని, వాటర్ ట్యాంకులను ప్రతిరోజు క్లోరినేషన్ చేయాలని,రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని గ్రామాల్లో ఎక్కడా కూడా మంచినీటి సమస్య రాకుండా చూడాలని కోరారు.సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, విస్తరణాధికారి అందరూ వీటిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎంపీడీఓ వాణి ఒక ప్రకటనలో తెలిపారు.

# వైయన్ కళాశాలలోప్రారంభమైన జాతీయ సమైక్యత శిబిరం







నరసాపురం, మేజర్ న్యూస్: స్థానిక శ్రీ వై.యన్. కళాశాల జాతీయ సేవా విభాగం, మినిస్ట్రీ ఆఫ్ యూత్ అఫైర్స్ అండ్ స్పోర్ట్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఆరు రోజులు పాటు జరిగే జాతీయ సమైక్యత శిబిరం సోమవారం ప్రారంభమైనది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆదికవి నన్నయ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య వై శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ' 12 రాష్ట్రాల నుండి ఇక్కడికి విచ్చేసిన పిఓ స్టాఫ్ కు అభినందనలు తెలియజేస్తూ, ఎన్నో ఆచార వ్యవహారాలు, సాంప్రదాయాలు, కట్టుబాట్లు అన్నీ కలగలిపి ఉన్న దేశమే మన భారతదేశం అని, ఎన్నో దేశాల సమాహారమే మన భారతదేశం కాబట్టి దీనిని ఉపఖండంగా భావిస్తారని, అందుకే ప్రపంచ దేశాల్లో మన దేశం ఎల్లప్పుడూ ప్రత్యేక స్థానంలో ఉంటుందని అన్నారు. అటువంటి దేశంలో గల రాష్ట్రాల నుండి మీరంతా వచ్చినందుకు ఈ మధ్య గల సమైక్యతను చాటి చెప్పాలని ఇటువంటి శిబిరాలను ఏర్పాటు చేస్తున్నామని, మీ ఆచార వ్యవహారాలను గౌరవిస్తూ, మీ ఆలోచన ధోరణిని పంచుకుంటూ ముందుకెళ్లాలని ఆశిస్తున్నానని' అన్నారు.

ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రెటరీ కరస్పాండెంట్ డాక్టర్ చినిమిల్లి సత్యనారాయణ రావు, కోశాధికారి పోలిశెట్టి శ్రీ రఘురామారావు, పాలకవర్గ సభ్యులు డాక్టర్ వర్మ, కళాశాల డీన్ డాక్టర్ గంధం శ్రీరామకృష్ణ, ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఆచార్య పి. వెంకటేశ్వరరావు, రీజనల్ డైరెక్టర్ ఎం రామకృష్ణ, యూత్ ఆఫీసర్ సైదా నాయక్, కోశాధికారి ఎం. సంజయ్ , వై ఎన్ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆఫీసర్లు చింత సోమేశ్వరి యాకోబ్, వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన ఎన్ఎస్ఎస్ పిఓ లు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# కటకటాల్లోకి కసాయి సవతి తండ్రి



**జంగారెడ్డిగూడెం,మేజర్‌న్యూస్:** జంగారెడ్డిగూడెం పోలీస్ స్టేషన్ పరిధిలో నివాసం ఉంటున్న గానాల పవన్ కుమార్ అనే వ్యక్తి మైనర్ బాలుడు, బాలికలను చిత్రహింసలు చేసిన విషయంపై సీఐ కృష్ణ బాబు ఆధ్వర్యంలో ఎస్ఐ జబీర్ ముద్దాయిని అరెస్టు చేశారు. సోమవారం పవన్‌ను అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లుగా ఎస్సై జబీర్ తెలిపారు.

# సంస్కృత భారతీ శిక్షణా కేంద్రం ప్రారంభం




**తాడేపల్లిగూడెం, మేజర్‌న్యూస్:** సంస్కృత భారతీ ఆంధ్ర ప్రదేశ్ విజయవాడ శాఖ నిర్వహణలో తాడేపల్లిగూడెంలో మొదటి సారిగా "సరలా" సంస్కృత పరీక్ష సోమవారం స్థానిక రామచంద్రరావు పేటలో నిర్వహించబడింది. కొలచన మహతి నిర్వహణలో స్థానిక మహతీ సంస్కృత శిక్షణా కేంద్రం ఆవరణంలో నిర్వహించిన ఈ పరీక్షను శంకర మఠం నిర్వాహకులు వేమూరి రామమ్,గరికిపాటి బాపయ్య శర్మలు పర్యవేక్షకులుగా హాజరై ప్రారంభించారు. 16 మంది విద్యార్థినీ,విద్యార్థులు శిక్షణ తీసుకొని హాజరైన ఈ పరీక్ష నిర్వహణలో అతిధులుగా డాక్టర్ కొలచన సూర్యనారాయణ మూర్తి, కృష్ణ ప్రసాద్ హాజరయ్యారు. సంస్కృత భాష లో "సరలా" మొదలుగా "సుగమ" వరకు అన్ని స్థాయిల్లో ఈ శిక్షణా కేంద్రం లో ఉచిత శిక్షణ ఇవ్వబడుతుందని, ఈ అవకాశాన్ని విద్యార్థిని విద్యార్థులు ఉపయోగించు కోవాలని సమన్వయ కర్త మహతి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తల్లిదండ్రులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

# వేలగొంతులు లక్ష డప్పులు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి



ద్వారకాతిరుమల,మేజర్‌న్యూస్: హైదరాబాదులో ఈనెల 7వ తేదీన జరిగే ఎస్సీ వర్గీకరణ అమలుకై వేల గొంతులు లక్ష డప్పులు, కార్యక్రమాన్ని విజయ వంతం చేయాలని ఎమ్మార్పీ ఎస్ రాష్ట్ర కోఆప్షన్ సభ్యులు బయ్యారపు రాజేశ్వరరావు మాదిగ అన్నారు. ద్వారకాతిరుమలలో ఎమ్మార్పీఎస్ ముఖ్య నాయకుల మండల సమావేశం సోమవారం స్థానిక వైష్ణవి ఫంక్షన్ హాల్ నందు నిర్వహించారు. ఈ సందర్భంగా వేల గొంతులు-లక్ష డప్పులు గోడ పత్రికను ఆవిష్కరించారు. అనంతరం రాజేశ్వరరావు మాట్లాడుతూ మండలంలోని ప్రతి గ్రామం నుంచి మాదిగ జాతికి చెందిన ప్రతి ఒక్కరు డప్పు చేత పట్టుకొని హైదరాబాద్ తరలిరావాలని అన్నారు. మందకృష్ణ మాదిగ కు పద్మశ్రీ అవార్డు రావడం యావత్ మాదిగ జాతికే గర్వకారణం అని ఆయన అన్నారు. ఎన్ని అవాంతరాలు ఎదురైనా ఎస్సీ వర్గీకరణ లక్ష్యంగా ఆయన ముందుకు సాగారన్నారు. చెప్పులు కుట్టిన చేతులతోనే చరిత్ర రాస్తామని,ఆయన ముందుగానే చెప్పారన్నారు. ఈనెల 7వ తేదీన జరిగే కార్యక్రమం ప్రపంచంలోనే ఒక సాంస్కృతిక విప్లవమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్పిఎస్ జిల్లా అధ్యక్షులు నమ్మిన నాగార్జున మాదిగ, ప్రధాన కార్యదర్శి నాగేంద్రబాబు మాదిగ, మండల అధ్యక్షులు కంకిపాటి గాంధీ మాదిగ, కో కన్వీనర్ జునుపూడి సిద్దయ్య మాదిగ, మద్దాల వెంకటేశ్వరరావు మాదిగ, ఉందుర్తి రమణ మాదిగ, చిలక వీరస్వామి మాదిగ, ఏపూరి కిషోర్ మాదిగ, నల్లంటి రామారావు మాదిగ తదితరులు పాల్గొన్నారు.

# జనవాణిలో పాల్గొన్న ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్



**మంగళగిరి/తాడేపల్లిగూడెం,మేజర్‌న్యూస్:** మంగళగిరి జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో సోమవారం జరిగిన జనవాణి కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ పాల్గొన్నారు. రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు నుండి వినతి పత్రాలు స్వీకరించి వారి సమస్యలను వింటూ అప్పటికి అప్పుడే సమస్యలను పరిష్కరించేల చర్యలు చేపట్టారు. వాళ్ల కష్టాలని తీర్చే దిశగా జనవాణి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ పిలుపుమేరకు ప్రజలందరికీ న్యాయం చేయాలని ఈ జనవాణి కార్యక్రమాన్ని నిర్వహించడం చాలా సంతోషకరమని పేర్కొన్నారు. అనేక జిల్లాల నుంచి తరలివచ్చిన ప్రజలకు న్యాయం చేసే ప్రభుత్వం ఈ కూటమి ప్రభుత్వం అని, నాకు అవకాశం ఇచ్చిన జనసేన పార్టీ అధ్యక్షుడు, డిప్యూటీ సీఎంకి హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపుకుంటున్నానని అన్నారు.

# మెగా ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

**300 మందికి చికిత్స,రూ.10 లక్షల విలువైన మందులు పంపిణీ**






**తాడేపల్లిగూడెం,మేజర్‌న్యూస్:** తాడేపల్లిగూడెం చైతన్య ఎమర్జెన్సీ హాస్పిటల్‌లో సోమవారం జరిగిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. పెద్ద సంఖ్యలో ఈ వైద్య శిబిరానికి హాజరయ్యారు. దాదాపు 300 మంది ఈ వైద్య శిబిరంలో పరీక్షలు జరిపి చికిత్స పొందారు పది లక్షల రూపాయలు విలువైన మందులను ఈ సందర్భంగా పంపిణీ చేశారు. విజయవాడ కామినేని హాస్పిటల్, తాడేపల్లిగూడెం చైతన్య హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో జరిగిన ఈ వైద్య శిబిరానికి గుండె సంబంధిత వ్యాధులు ఆయాసం, ఉబ్బసం, అన్ని రకాల శ్వాసకోశ వ్యాధులు, షుగర్, బి.పి, పక్షవాతం, అన్ని రకాల నరాల సంబంధిత వ్యాధులు, అన్ని జనరల్ వ్యాధులకు పరీక్షలు జరిపి ఉచితంగా మందులు అందజేశారు. ప్రముఖ గుండె వైద్య నిపుణులు డాక్టర్ ఎంకే వెంకటేశ్వర్లు న్యూరో సర్జన్ డాక్టర్ ఎస్ పాన్రాజ్ జనరల్ మెడిసిన్ ఎండి డాక్టర్ బి దివ్యశ్రీ జనరల్ సర్జన్ డాక్టర్ సిహెచ్ నవీన్ కుమార్ న్యూరో స్పెషలిస్ట్ డాక్టర్ నరేంద్ర కుమార్ తదితర డాక్టర్స్ టీం ఈ వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తాడేపల్లిగూడెం చైతన్య ఎమర్జెన్సీ హాస్పిటల్ నిర్వాహకులు కె.సోమేశ్వరరావు, బాకా వెంకటేశ్వరరావు, కూచిపూడి అనిల్ కుమార్ , మైలవరపు వాసు , పులపర్తి రాంపండు తదితరులు పాల్గొన్నారు.

# పీఎం లంక వద్ద సముద్రం కోత నిరోధక పనులు వెంటనే చేపట్టాలి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి




భీమవరం, మేజర్ న్యూస్:పీఎం లంక వద్ద సముద్రం కోత నిరోధానికి డిలైట్ కంపెనీ ప్రాజెక్టు పనులను వెంటనే చేపట్టాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి కోరారు. సోమవారం భీమవరం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి న్యూఢిల్లీలోని డిలైట్ ప్రతినిధులతో వర్చువల్ గా సమావేశమై పీఎం లంక ప్రాజెక్టుపై సమీక్షించారు. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ దత్తత గ్రామమైన పీఎం లంక వద్ద సముద్రపు కోత గురికావడంతో దానికి అడ్డుకట్ట వేసే ప్రాజెక్టుకు డిలైట్ కంపెనీ ప్రతినిధులతో ఒప్పందం కుదుర్చుకోవడం జరిగింది. అడ్డుకట్ట వాల్ నిర్మాణానికి ఇప్పటికే అలైన్మెంట్ రూపొందించి, నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న దశలో స్థానిక రైతులు ఈ విషయమై అభ్యంతరాలను తెలియజేయడం, అలైన్మెంట్ ను మార్చవలసిందిగా కోరడం జరిగింది. జిల్లా కలెక్టర్ డిలైట్ ప్రతినిధులతో మాట్లాడుతూ అలైన్మెంట్ విషయమై నరసాపురం ఆర్డిఓ రైతులతో మాట్లాడి ఒక పరిష్కార మార్గాన్ని వారికి తెలిపి ఒప్పించడం జరిగిందని, గతంలో ప్రతిపాదించిన అలైన్మెంట్ ను ఆమోదిస్తున్నానని, దీని ప్రకారమే సాధ్యమైనంత త్వరగా ప్రాజెక్ట్ పనులను ప్రారంభించి పూర్తిచేయాలని డిలైట్ ప్రతినిధులను జిల్లా కలెక్టర్ కోరడం జరిగింది. ఆర్డిఓ ప్రతిపాదనలను డిలైట్ కంపెనీ ప్రతినిధులు అంగీకరిస్తూ, ప్రాజెక్టు నిర్మాణానికి ఆమోదం తెలియజేయడం జరిగింది. వర్చువల్ సమావేశంలో నరసాపురం ఆర్డీవో దాసిరాజు, నరసాపురం ఇరిగేషన్ డిఈ సిహెచ్ వివిఎస్ సత్యనారాయణ, నరసాపురం తహసిల్దార్ పాల్గొన్నారు.

# తీర ప్రాంతాల పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలి



**విద్యాశాఖ అధికారులకు ఉపాధ్యాయులకు జిల్లా కలెక్టర్ ఆదేశం**

**భీమవరం, మేజర్ న్యూస్:**తీర ప్రాంత గ్రామాల పిల్లలు పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని విద్యాశాఖ అధికారులను, ప్రధానోపాధ్యాయులను జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశించారు.సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం వశిష్ట సమావేశ మందిరం నందు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు చేరికలు, పాఠశాలలు పునర్వ్యవస్థీకరణపై డీఈవో, నరసాపురం, మొగల్తూరు, పాలకొల్లు , యలమంచిలి మండల విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులతో సమీక్ష సమావేశంను నిర్వహించారు. ఈ సందర్భంగా తక్కువ విద్యార్థులు ఉన్న పాఠశాలలను పునర్వ్యవస్థీకరణ చేయుటకు అనువుగా ఉన్న పాఠశాలలను గుర్తించేందుకు పిపిటి ద్వారా అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ పాఠశాలలు పునర్వ్యవస్థీకరణ లోభాగంగా ఒక్క విద్యార్థి కూడా డ్రాప్ అవుట్ కాకుండా చూడాలని అధికారులును ఆదేశించారు. ముఖ్యంగా తీర ప్రాంతం గ్రామాలు పిల్లలు డ్రాప్ అవుట్స్ కాకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఆడపిల్లలకు బాల్య వివాహాలు చేయకుండా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. ప్రైవేటు పాఠశాలల కన్నా ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్న పిల్లలకు చక్కటి భవిష్యత్తు ఉంటుందని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సదుపాయాలు కల్పించడం జరుగుతుందని అన్నారు. పునర్వ్యవస్థీకరణపై విద్యార్థుల తల్లిదండ్రులకు అర్థమయ్యే రీతిలో అధికారులు అవగాహన కల్పించాలని అన్నారు.

ఒకరిద్దరూ ఉన్న పాఠశాలల కన్నా, ఎక్కువ మంది విద్యార్థులు కలిగిన పాఠశాలలో చదువుకోవడం ద్వారా ఒకరి నుండి ఒకరికి అనేక విషయములు తెలుసుకోవడానికి వీలవుతుందని, తద్వారా వారికి మంచి ఆలోచనలు, తెలివితేటలు కలుగుతాయి అన్నారు. ఈ విషయం ప్రతి విద్యార్థుల తల్లిదండ్రుతో ఒకటికి రెండుసార్లు మాట్లాడి అవగాహన కల్పించాలని సూచించారు. వచ్చే విద్యా సంవత్సరానికి. ఎక్కువమంది పిల్లలు ప్రభుత్వ పాఠశాలలో చదువుకునేలా ప్రత్యేక క్యాంపెయిన్ నిర్వహించాలని అన్నారు. విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు సమన్వయంతో పని చేసి మంచి ఫలితాలను రాబట్టాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశించారు.ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఇ.నారాయణ, నరసాపురం, మొగల్తూరు, పాలకొల్లు, యలమంచిలి మండలాల ఎంఈఓ లు పి.పుష్పరాజ్యం, జి.జాన్ ప్రభాకర్, జి.వీరాస్వామి, ఎన్ వి ఎస్ జి శర్మ, డి.సుభకరరావు, కె.వెంకట రామకృష్ణ రాజు, ప్రధానోపాధ్యా యులు, తదితరులు పాల్గొన్నారు.

# రిటైర్డ్ అడిషనల్ ఎస్పీ పి.రత్నయ్య మృతి



**ఏలూరు, మేజర్ న్యూస్ :**రిటైర్డ్ అదనపు ఎస్పీ కత్తుల రత్తయ్యగా ప్రసిద్ధి చెందిన పొనుకు రత్నయ్య సోమవారం సాయంత్రం మృతి చెందారు. స్థానిక విద్యానగర్లోని స్వగృహంలో ఆయన గత కొంతకాలంగా అస్వస్థతతో ఉన్నారు.

నేరస్తుల పాలిట సింహ స్వప్నంగా నిలిచారని, ఏలూరు టూ టౌన్ ఎస్సైగా బాధ్యతలు నిర్వహించిన సమయంలో ఎజ్డీ మోటార్ సైకిల్ పై ఆయన వస్తుంటే,ఆ శబ్దం వింటేనే పట్టణంలో రౌడీ షీటర్లు, ఇతర నేరాలకు పాల్పడేవారు భయభ్రాంతులకు గురయ్యేవారని పేరు ఉంది. ఎవరి రికమండేషన్లు పట్టించు కోకుండా, ఎవరికి భయపడకుండా విధులు నిర్వహించి, అటు పోలీసు ఉన్నతాధికారుల,ఇటు ప్రజల మన్ననలు పొందారు. ఏలూరులోని అమీనాపేట లూథరన్ చర్చిలో ఆయన పలు బాధ్యతలు నిర్వహించారు. రత్నయ్య మృతికి పలువురు తీవ్ర విచారం వ్యక్తం చేశారు.

# మాంటిస్సోరీ స్కూల్‌లో సామూహిక అక్షరాభ్యాసం





పాలకొల్లు,మేజర్‌న్యూస్: పాలకొల్లుమాంటిస్సోరి స్కూల్ ప్రాంగణము నందు శ్రీ పంచమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఉదయం 8 గంటలకు లక్ష్మీ గణపతి హోమం, సరస్వతి హోమం, సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం వేద పండితులచే శాస్త్రీయంగా వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు ముఖ్యఅతిథిగా పాల్గొని, అక్షర స్వీకారం చేసినటువంటి విద్యార్థులకు శుభాశీస్సులు అందిస్తూ తల్లిదండ్రులను ఉద్దేశించి మాట్లాడుతూ చిన్నారులకు మనం అందించే వేలకట్ట లేనటువంటి ఆస్తి విద్య మాత్రమేనని, కనుక తల్లిదండ్రుల శ్రద్ధ తీసుకుని విద్యార్థుల్ని ఉన్నత విద్యా వంతులుగా తీర్చిదిద్దాలని సూచిస్తూ, ఇటువంటి చక్కటి సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని చేపట్టినటువంటి పాలకొల్లు మాంటిసోరి స్కూల్ అండ్ జూనియర్ కళాశాల యాజమా న్యాన్ని అభినందించారు. కార్యక్రమంలో మాజీ శాసనమండలి సభ్యులు అంగర రామ్మోహన్ , మేకా శేషుబాబులు కూడా పాల్గొని విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేసి స్వయంగా విద్యార్థులచే అక్షరాల దిద్దించారు. ఈ కార్యక్రమంలో స్కూల్, జూనియర్ కళాశాల సెక్రటరీ ,కరెస్పాండెంట్ కె.వి కృష్ణ వర్మ దంపతులు సరస్వతి పూజా కార్యక్రమాలు నిర్వహించగా, పాలకొల్లు స్కూల్ ప్రాంగణంలో జాయింట్ సెక్రెటరీ దండు బంగార్రాజు దంపతులు, మేడపాడు స్కూల్ ప్రాంగణంలో అడ్డాల వాసు దంపతులు లక్ష్మీ గణపతి హోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున చిన్నారులు తల్లిదండ్రులు కుడా పాల్గొన్నారు,ఈ సామూహిక అక్షరాభ్యాసం మహోత్సవంలో సుమారు 210 మందికి పైగా చిన్నారులు అక్షరాభ్యాసం చేశారు,డిసెంబర్, జనవరి నెలలో మాంటిసోరి జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించినటువంటి మెరిట్ స్కాలర్షిప్ టెస్టులో ప్రతిభను కనబరిచ్చిన విద్యార్థులకు సోమవారం అతిథుల చేతుల మీదుగా ఫీజు రాయితీలు, ఉచిత ఫీజులకు సంబంధించినటు వంటి పత్రాలను ప్రదానం చేశారు.ఈ కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ చిలుకూరు కుమార్, బిజెపి నాయకులు జక్కంపూడి కుమార్, కొల్లి కొండ ప్రసాద్, తెలుగుదేశం నాయకులు గండేటి వెంకటేశ్వరరావు, పెచ్చుటి బాబు, ప్రముఖ సిద్ధాంతి సోమంచి శ్రీనివాస శాస్త్రి, ఎలమంచిలి మండల టిడిపి అధ్యక్షులు మామిడి శెట్టి పెద్దిరాజు, ఎలమంచిలి మండల టిడిపి నాయకులు చిలుకూరి బాలాజీ, బొప్పన చిన్న, ఆరిమిల్లి చిన్ని మేడపాడు ఎంపీటీసీ దేగల సూర్యప్రభ దేగల వెంకటేశ్వరరావు, యలమంచిలి బిజెపి నాయకులు దొంగ కుమార్ ప్రిన్సిపాల్స్ ఎస్ పి ఎస్ ప్రకాష్ రావు, బందారు సత్యనారాయణ ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొని ఈరోజు ఇక్కడ అక్షరాభ్యాసం చేసుకున్న చిన్నారులందరూ జీవితంలో అత్యున్నత స్థాయికి ఎదగాలి అని చిన్నారులను ఆశీర్వదించారు. లజపతిరాయ్ పేట మాంటిసోరి, మేడపాడు సుజాతాస్ మాంటిసోరి స్కూలు, జూనియర్ కళాశాలలు అనతి కాలంలోనే విద్యార్థుల తల్లిదండ్రుల ఆదర అభిమా నాలను చూరగున్నాయిని, తమ సంస్థల పట్ల ఉన్న నమ్మకంతో పాలకొల్లు స్కూల్ ప్రాంగణంలోనూ, మేడపాడు స్కూల్ ప్రాంగణంలోనూ అక్షర స్వీకారం చేయిచిన విద్యార్థులు తల్లిదండ్రులకు కెవికృష్ణవర్మ కృతజ్ఞతలు తెలియజేశారు. అదేవిధంగా విద్యార్థులకు క్రమశిక్షణతో, ప్రణాళికాబద్ధ ంగా విద్యాబోధన చేసి వారి సర్వతో ముఖాభివృద్ధికి తోడ్పడుతామని అన్నారు.

## ప్రభుత్వ విప్ నాయకర్‌ను పరామర్శించిన దేశం నేత నాయుడు



**నర్సాపురం, మేజర్ న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్ ను తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కొవ్వలి యతి రాజా రామ్మోహన్ నాయుడు పరామర్శించారు. ఆదివారం నర్సాపురం నుండి విజయవాడ కారులో వెళుతుండగా బైక్ అడ్డం ం ా వ డ ం త్ో అదుపుతప్పిన కారు ముళ్లపదల్లోకి దూసుకుపోయిన విషయం తెలిసిందే. కాగా విషయం తెలుసుకున్న నాయుడు అమెరికాలో ఉండటం వల్ల సోమవారం ఉదయం నాయకర్ ను ఫోన్లో పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం చేయించుకుని తొందరగా కోలుకోవాలని నాయుడు ఆకాంక్షించారు.

# పదవ తరగతి పరీక్షల్లో ప్రతిభ చూపాలి



వీరవాసరం,మేజర్‌న్యూస్: వీరవాసరం మద్దాల రామకృష్ణమ్మ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు పాఠశాల పూర్వ విద్యార్థి సంఘం అధ్యక్షులు గుండా రామకృష్ణ, సభ్యుల ఆధ్వర్యంలో ప్రధానోపాధ్యాయులు జుత్తిగ శ్రీనివాస్ అధ్యక్షతన జరిగింది.మాస్ట్రో డా. గజల్ శ్రీనివాస్ చే 10వ తరగతి విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన వక్తగా విచ్చేసిన మాస్ట్రో డా. గజల్ శ్రీనివాస్ త్వరలో ప్రారంభం కానున్న 10వ తరగతి పరీక్షల నేపథ్యంలో విద్యార్థులకు విద్యపట్ల అవగాహనను పెంచే విధంగా సందేశాన్ని ఇచ్చారు. ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని వాటిని సాధించే విధంగా ప్రణాళికలు రచించుకోవాలని, ఉన్నతస్థాయి సాధనే గమ్యంగా ప్రయత్నం కొనసాగించాలని, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పట్ల గౌరవ మర్యాదలు కలిగియుండి వారి మార్గదర్శకత్వంలో జీవితాన్ని సార్థకం చేసుకోవాలని సందేశాన్ని ఇచ్చారు. విద్యార్థులలో ప్రేరణ కలిగించే గజల్స్ పాడి వారిలో నూతన ఉత్సాహాన్ని నింపారు.

ఈ కార్యక్రమ నిర్వాహకులైన గుండా రామకృష్ణ మాట్లాడుతూ 175 సంవత్సరాల చరిత్ర కలిగిన పాఠశాలలో చదువుకోవడం అదృష్టమని, దానిని సద్వినియోగం చేసుకొని రాబోయే10వ తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఈ సంవత్సరం 10వ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థికి పూర్వ విద్యార్థి సంఘం తరపున 10 వేల రూపాయల నగదు బహుమతిని అందజేస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో మరొక అతిథిగా పాల్గొన్న వీరవాసరం సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ రాజ్ కుమార్ మాట్లాడుతూ గజల్ శ్రీనివాస్ వంటి గొప్పవ్యక్తుల సందేశం లభించడం అదృష్టమని, వారి మాటలు పాటించి ఉన్నత స్థానాలను చేరుకోవాలని అన్నారు.

ఇంకా ఈ కార్యక్రమంలో వీరవాసరం మాజీ సర్పంచ్ వీరవల్లి రామకృష్ణ , పూర్వ విద్యార్థి సంఘం ప్రధాన కార్యదర్శి బాజింకి కృష్ణారావు ,ఎస్ఎంసి మాజీ ఛైర్మన్ మతల కాశీ విశ్వేశ్వరరావు , స్టేట్ లైబ్రరీ సంఘం అధ్యక్షులు బోను రామకృష్ణ ,పాల ఆంజనేయులు,పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థినీవిద్యార్థులు మరియు డివైన్ మెర్సీ, లిటిల్ బడ్స్ , భారతీ పాఠశాలల 10వ తరగతి విద్యార్థిని విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ ఎన్నిక నిర్వహణకు రాజకీయ పార్టీలు సహకరించాలి

**10 వరకు నామినేషన్లు స్వీకరణ**

**27న పోలింగ్, మార్చి 3న కౌంటింగ్**





**ఏలూరు,మేజర్‌న్యూస్ :** ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లా పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికల ప్రక్రియను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్నిరాజకీయ పార్టీలు సహకరించాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి కె. వెట్రిసెల్వి కోరారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ గౌతమీ సమావేశ మందిరంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణ విషయమై రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకారం ఎమ్మెల్సీ ఎన్నికలకు ఫిబ్రవరి 3న నోటిఫికేషన్ జారీ చేయడం జరిగిందన్నారు. ఫిబ్రవరి 10 వరకు నామినేషన్లు స్వీకరణ, ఫిబ్రవరి 11న నామినేషన్ల పరిశీలన, ఫిబ్రవరి 13న నామినేషన్ల ఉపసంహరణ ఉంటుందని తెలిపారు. ఫిబ్రవరి 27వ తేదీ ఉదయం 8.00 గం. నుండి సాయంత్రం 4.00 గం. వరకు పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గం పోలింగ్ ఉంటుందని, మార్చి 3వ తేదీన కౌంటింగ్ ఉంటుందన్నారు. మార్చి 8వ తేదీ నాటికి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియ ముగుస్తుందని ఆమె వెల్లడించారు. ఈ ఎన్నికలకు సంబంధించి ఏలూరు జిల్లా కలెక్టర్ రిటర్నింగ్ అధికారిగా వ్యవహరించడం జరుగుతుందన్నారు. ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలో పట్టభద్రుల నియోజకవర్గంలో అల్లూరి సీతారామరాజు, కాకినాడ, డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాల్లో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి 440 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయన్నారు. వీటిలో 3,15,261 మంది ఓటర్లు ఉన్నారన్నారు. అదే విధంగా ఈ ఎన్నికల నేపద్యంలో ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లో ఉంటుందన్నారు. అదే విధంగా ఇప్పటి వరకు అందిన 8,501 క్లైయిమ్ లు అన్నింటిని పరిశీలించి ఫిబ్రవరి 5వతేదీ లోపు ఇఆర్ఓ నెట్ లో అప్ డేట్ చేయడం జరుగుతుందన్నారు. ఏలూరు డివిజన్‌లో 8 మండలాల్లో 37 పోలింగ్ స్టేషన్లు, జంగారెడ్డిగూడెం డివిజన్‌లో 10 మండలాల్లో 23 పోలింగ్ స్టేషన్లు, నూజివీడు డివిజన్‌లో 2 మండలాల్లో 6 పోలింగ్ స్టేషన్లు ఉంటా యన్నారు. ముసాయిదా ఓటర్ల జాబితా నాటికి 440 పోలింగ్ కేంద్రాలు ఉండగా వీటికి అనుబంధంగా 16 పోలింగ్ స్టేషన్లను ప్రతిపాధించడం జరిగిందన్నారు.

అదే విధంగా కృష్ణా, గుంటూరు పట్టభద్రుల నియోజవర్గాలకు సంబంధించి గుంటూరు జిల్లా కలెక్టర్ రిటర్నింగ్ అధికారిగా వ్యవహరిస్తారన్నారు. ఏలూరు జిల్లాకు సంబంధించి ఏఆర్‌ఓగా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ యం. ముక్కంటి వ్యవహరిస్తారన్నారు. ఏలూరు జిల్లాలో 20 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఇందుకు సంబంధించి ఏలూరు జిల్లాలో 16,077 మంది ఓటర్లు ఉండగా వారిలో 9858 మంది పురుషులు, 6,218 మంది మహిళలు, ఒక ట్రాన్స్ జండర్ ఉన్నారన్నారు. ఇందుకు సంబంధించి 20 పోలింగ్ స్టేషన్లకు అధనంగా మరో పోలింగ్ కేంద్రాన్ని ప్రతిపాధించడం జరిగిందన్నారు. 57 క్లైయిమ్ లు స్వీకరించడం జరిగిందన్నారు. సమావేశంలో సహాయ రిటర్నింగ్ అధికారి,జిల్లా రెవిన్యూ అధికారి వి.విశ్వేశ్వరరావు, నెరుసు నెలరాజు (బిజెపి), ఎస్.అచ్యుతబాబు,యు.బాలానందం, (టిడిపి), ఎస్. సత్యనారాయణ(సిపిఐఎం), సిర్రా భరత్(బిఎస్పీ), ఎస్.కె.భాషా (ఆమ్ ఆద్మీ), ఎస్. ఆదిశేషు(సిపిఎం) తదితరులు పాల్గొన్నారు.

# విచ్చల విడిగా గ్రావెల్ అక్రమ రవాణా







**కొయ్యలగూడెం -నల్లజర్ల మండలాల సరిహద్దులో**

**సుభద్రపాలెం మెట్ట లూటీ**

**పట్టించుకోని సంబంధిత శాఖల అధికారులు**

**కొయ్యలగూడెం, మేజర్‌న్యూస్:** కొయ్యలగూడెం మండలం యర్రంపేటకు, నల్లజర్ల మండలం సుభద్రపాలెంకు మధ్య ఉన్న సుభద్రపాలెం మెట్ట (కొండ) ప్రాంతమైన ప్రభుత్వ భూమిలో గ్రావెల్ ను గత కొద్దిరోజులుగా మూడు ప్రొక్లయినర్లతో వంతుల వారీగా త్రవ్వి వందలాది లారీ ట్రిప్పులు దూరప్రాంతాలకు అక్రమంగా రవాణా చేస్తూ దోపిడీ చేస్తున్నారు. ప్రభుత్వ భూగర్భ ఖనిజవనరులను కాపాడవలసిన భూగర్భ ఖనిజ వనరుల శాఖ, రెవెన్యూ శాఖ, పోలీస్ యంత్రాంగం కళ్ళు మూసుకుని తమకేమీ తెలియనట్లు వ్యవహరిస్తున్నారని విమర్శలు వినవస్తున్నాయి.రెవెన్యూ, పోలీస్ అధికారులకు గ్రామస్థులు తెలియచేసినప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోకుండా, అక్రమ రవాణాదారులు, మిషన్లు, లారీలు వెళ్లిపోయిన తరువాత, తీరుబడిగా వెళ్లి అక్కడ ఏమీ లేదని కితాబు ఇవ్వడంపై ప్రజలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఈ మెట్ట ప్రాంతం ఆరిపాటిదిబ్బలు-యర్రంపేట రోడ్డు నుంచి వ్యవసాయ భూములు మీదుగా సుభద్రపాలెం వెళ్లే పుంత రోడ్డును ఆనుకుని ఉంది. సుభద్రపాలెం గ్రామానికి దగ్గరలో ఉన్న ఈ కొండ ప్రాంతంలో కొంతమేర ప్రభుత్వ అనుమతితో గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణం కోసం గ్రావెల్ త్రవ్వి రవాణా చేస్తున్నారు. దీన్ని అదనుగా చేసుకుని కొయ్యలగూడెం మండలానికి చెందిన గ్రావెల్ బకాసురులు కొందరు మూడు ప్రొక్లయినర్లతో వంతుల వారీగా గ్రావెల్ త్రవ్వి, నల్లజర్ల మండలం చీపురుగూడెం తదితర ప్రాంతాలకు కొయ్యలగూడెం మండలంలోని కొన్ని గ్రామాలకు అక్రమంగా రాత్రి, పగలు తేడా లేకుండా రవాణా చేస్తున్నారు. ఒక్కో ప్రొక్లయిన్ రోజుకు 100 లారీల వంతున గ్రావెల్ ను అక్రమంగా త్రవ్వేస్తున్నట్లు రవాణాదారులే బాహటంగా చెప్పడం విస్తుగొలుపుతుంది. ఈ ప్రొక్లయిన్ల యజమానుల్లో ఒకరికి, ఒకరు పొసగకపోవడంతో ఒకరిపై ఒకరు ఫిర్యాదులు చేసుకుంటున్నారు.

సుభద్రపాలెం పుంత మార్గాన్ని ప్రొక్లెయిన్ తో ఇరువైపులా మార్జిన్ త్రవ్వి పక్కా రాజమార్గంగా అభివృద్ధి చేసి, ఈ గ్రావెల్ దోపిడీదారులు తరలిస్తున్నారు.రెవెన్యూ అధికారులకు అక్రమ రవాణా జరుగుతున్న విషయం ఎవరైనా ఫొటోలు తీసి, తెలియజేస్తున్నా క్రింది స్థాయి ఉద్యోగులు ఆ ప్రాంతానికి వెళ్లి గుట్టుగా రవాణా వాహనాలు, ప్రొక్లెయిన్లను అక్కడి నుంచి పంపిచేస్తున్నారు. ఆ తరువాత అక్కడ ఏమీ జరగటం లేదని అధికారులకు నివేదిక ఇస్తున్నారు. తమ దృష్టికి వచ్చిన కొన్ని అక్రమ రవాణా వాహనాలను పోలీసులు తనిఖీ చేసి పట్టుకున్నప్పటికీ కేసులు పెట్టకుండా వదిలివేస్తున్నారనే విమర్శలు వినవస్తున్నాయి.

గ్రీ3న్ ఫీల్డ్ హైవేకు రవాణా అవుతున్న గ్రావెల్ లారీల ముసుగులో అక్రమ రవాణాదారులు కూడా ఈ దందాను నిర్భంయంగా, నిరాటకంగా కొనసాగిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. జిల్లాలో భూగర్భ ఖనిజ శాఖ అధికారులు ఉన్నప్పటికీ ఈ విషయమై ఎవరూ పట్టించుకోవటం లేదు. అయితే సంబంధిత శాఖల అధికారులకు రోజువారీ ముడుపులు, నెలవారీ ముడుపులు అందుతున్నాయని అందుకే తమ జోలికి ఎవరూ రారని, కొందరు రవాణాదారులు బాహటంగానే చెబుతుండటం కొసమెరుపు. ఈ ఖనిజ సంపద దోపిడి అరికట్టేవారు ఎవరో దేవుడికే తెలియాలి.

## టైలర్స్‌తో ఉన్న అనుబంధంతోనే భవనానికి నిధులు -మంత్రి రామానాయుడు



**పాలకొల్లు,మేజర్‌న్యూస్:**టైలర్స్‌తో మంచి అనుబంధం ఉందని, ఆ ఉద్దేశంతోనే సంఘ నూతన భవనానికి నిధులు తీసుకొచ్చానని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు తెలిపారు. పాలకొల్లులో అల్లు వెంకట సత్యనారాయణ కాలనీలో కనుమూరి రఘురామ కృష్ణంరాజు ఎంపీ నిధులు 15 లక్షలతో నిర్మించిన సంఘ నూతన భవనాన్ని ఆయన సందర్శించారు. ఇంకా అసంపూర్తిగా ఉన్న చిన్నపాటి పనులను పూర్తిచేయాలని సంబంధిత శాఖ ఇంజనీరింగ్ అధికారులతో ఫోన్లో మాట్లాడి ఆదేశాలు ఇచ్చారు. భవనానికి నాణ్యతతో కూడిన పెయింటింగ్ ను మరోసారి వెయ్యాలని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి రామానాయుడు మాట్లాడుతూ టైలర్స్ నాకు ఎప్పుడూ కుటుంబ సభ్యుల వలె అండదండలుగా ఉంటున్నారని తెలిపారు. గత 15 సంవత్సరాల కిందట సంఘ భవనానికి శంకుస్థాపన జరిగి పునాదుల దశలో నిలిచిపోయి పందులకు నిలయంగా మారిందన్నారు. కనీసం నిలబడేందుకు కూడా ఉపయోగంచుకోలేని స్థితిలో ధర్మారావు ఫౌండేషన్ ద్వారా ప్రహరీ గోడ నిర్మించాలని టైలర్స్ వచ్చి కోరారు అన్నారు. వెంటనే స్పందించి ముందుగా నా సొంత డబ్బులు వెచ్చించి ధర్మారావు ఫౌండేషన్ ద్వారా ప్రహరీ గోడ నిర్మాణం జరిగిందన్నారు. అంతేకాకుండా నిధులు లేకపోయినా అప్పటి ఎంపీ కనుమూరి రఘురామ కృష్ణంరాజు ఎంపీ నిధులు రూ 15 లక్షలు తీసుకువచ్చానన్నారు. ఆ నిధులతో సంఘ నూతన భవనం నిర్మాణం టైల్స్, గోడలకు మక్కుతో పెయింటింగులు, సీలింగు వంటి వాటితో జరిగిందన్నారు. భవిష్యత్తులోనూ ఈ సంఘ భవనం అధునాతన సౌకర్యాలతో సుందరంగా తీర్చిదిద్దేలా కృషి చేస్తానని మంత్రి రామానాయుడు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్ష కార్యదర్శులు గుమ్మల్ల సత్యనారాయణ, మేకా సత్యనారాయణ, కోశాధికారి అంతే గంగాధర్, జాయింట్ సెక్రెటరీ కండాపు రాజారావు, పడకపల్లి కృష్ణమోహన్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి పెచ్చెట్టి బాబు, పట్టణ టిడిపి అధ్యక్షుడు గండేటి వెంకటేశ్వరరావు, కొలుకులూరి జయప్రకాష్, సామంతుల సత్యనారాయణ, దుగ్గిన రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి



**ద్వారకాతిరుమల,మేజర్‌న్యూస్:** మండలంలోని తిమ్మాపురం, కోడిగుడెం,రామసింగవరం గ్రామాలలో ఇళ్ల స్థలాలు లేని నిరుపేదలకు మూడు సెంట్లు ఇళ్ల స్థలం ఇవ్వాలని,ఇల్లు కట్టుకోవడానికి 5 లక్షల రూపాయలు తక్షణ మంజూరు చేయాలని కోరుతూ తాహాసిల్దార్ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా చేసి డిప్యూటీ తాసిల్దార్ కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ మండల కార్యదర్శి గోలిమే బాల యేసు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం మేరకు గ్రామాల్లో ఇంటి స్థలం లేని పేదలకు మూడు సెంట్లు ఇంటి స్థలం, వికలాంగులకు పెన్షన్లు,మరియు డప్పు కళాకారులకు 50 సంవత్సరాలకే పెన్షన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి గొలమే బాల యేసు,సిపిఐ గ్రామ కార్యదర్శి యడ్లపల్లి రమేష్,పెండ్లి భూషణం, కొప్పుల రామకృష్ణ,పాకనాటి సుబ్బారావు,ఉండి మార్తమ్మ ,పాకనాటి వెంకటేశ్వరరావు,నల్లటి దేవమాత, జాలాది సత్యవతి,యడ్లపల్లి లక్ష్మి, బయ్యారపు ఆనందరావు,నల్లటి పెద్దిరాజు,ఏపూరి పోతురాజు, జాలాది సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.